ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

నవంబర్ 16, 2014

పిల్లలు కాదు! పిడుగులు !!

ప్రాణదాతలు

www.friends2support.org



తెరపై దత్ జీవితం



బాలీవుడ్‌లో ఆత్మకథల జోరు బాగా వుంది. భాగ్ మిల్కా భాగ్, మేరీ కోమ్, పాన్‌సింగ్ తోమార్, డర్టీ పిక్చర్... అలా చెప్పుకుంటూ పోవచ్చు. మిల్కా సింగ్, పాన్‌సింగ్, సిల్క్‌స్మిత, మేరీ కోమ్...జీవితాలపై తీసిన చిత్రాలవి. ఫర్హాన్ అక్తర్, ఇర్ఫాన్ ఖాన్, విద్యా బాలన్, ప్రియాంక చోప్రా... ఆయా పాత్రలను చక్కగా పోషించారు. అయితే తాజాగా మరో చిత్రం కూడా ఈ జాబితాలో చేరబోతోంది.

సంజూ భాయ్ జీవితం ఆధారంగా ఓ సినిమా రానుందని ఇటీవల వార్తలు, కథనాలు పుంఖానుపుంఖాలుగా వచ్చేశాయి. కాకపోతే దాన్ని తీసేది మేమే అని చెప్పినవారు మాత్రం లేరు. ఇటీవల దర్శకుడు రాజ్ కుమార్ హిరాని ఆ పని చేసేశారు. సంజయ్ దత్ రియల్ పాత్రను రీల్ మీద రణబీర్ కపూర్ చెయ్యనున్నాడని చెప్పేరు. అంతేకాదు. 'ఇప్పటికే చిత్ర పూర్వ నిర్మాణ పనులు కూడా ప్రారంభించాం. ఎవ్వరినీ నొప్పించకుండా సంజయ్‌దత్ గురించి అనేక విషయాలు తెలిపేలా చిత్రం వుంటుంది' అని హిరాని చెప్తున్నారు.

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

◆ మనలో మాట

వారసత్వం!

అనగనగా కథలు ఎన్ని వినలేదు? ఎన్ని చదవలేదు? సుకుమార రాకుమారులు లేత వయసులోనే కాకులు దూరని కారడవికి వెళ్తారు. నార వస్త్రాలు కట్టుకుంటారు. కంద మూలాలు తింటారు. గురు శుశ్రూష చేస్తూ క్షత్రియోచిత విద్యలన్నీ ఔపోసన పడతారు. సర్వ శాస్త్ర పారంగతులై రాజ్యానికి తిరిగి వస్తారు. యువరాజుల వారి పట్టాభిషేకం జరుగుతుంది. తర్వాత చెప్పేదేముంది? వారసులుగా సింహాసనం అధిష్టించేస్తారు.

ఇప్పుడా రాజులు రాజ్యాలు యువరాజులు లేరు! కానీ వారసత్వాలు నిరాఘాటంగా కొనసాగుతూనే వున్నాయి. విశ్వ కుబేరుల వారసులు... ప్రభుత్వాల్ని సైతం ప్రభావితం చేయగల అపార శక్తిమంతుల బిడ్డలు ... విదేశాల్లో చదువు పూర్తి చేసుకుని... అనుభవం కోసం చేస్తున్న చిన్నా చితకా కొలువులను వదులుకొని ... తాతలూ తండ్రులూ నిర్మించిన కార్పొరేట్ సామ్రాజ్యాల్లో నాయకత్వ పట్టాభిషేకం చేసుకుంటున్నారు. రిలయన్స్, విప్రో, టీవీఎస్, పిరమల్, గోద్రెజ్, బిర్లా...వంటి సంస్థలన్నిటిదీ అదే రూటు.

వెండితెర మీద వారసత్వ చిత్రాలు ఎంత హృద్యంగా సాగుతున్నాయనీ! దర్శక నిర్మాతలుగా, నటీ నటులుగా.. అలా వారసత్వాన్ని అందిపుచ్చుకుని వచ్చేస్తుంటారు. అప్పట్లో తాతలు చిత్రాలు నిర్మిస్తే... ఇప్పుడు మనవళ్లు కథానాయకులుగా కత్తులు తిప్పేస్తుంటారు. అసలు వీరి చిత్ర రంగ ప్రవేశమే ఒక పథకం ప్రకారం జరుగుతుంది. ముందుగా బాల నటులుగా చిన్నా చితకా పాత్రల్లో నటింపచేయడం... అనంతరం భారీ బడ్జెట్లతో హీరోగా రంగంలోకి దించడం కళ్ల ముందున్నదే. ఈ సినిమాలకు ఇండస్ట్రీలో వున్న ఉత్తమ దర్శక, కథారచయితలు, పాటల రచయితలు, సంగీత దర్శకులు, గాయకులు పనిచేయడం సహజాతి సహజం. లేదా తాతలు, తండ్రులు, కొత్త తరంతో కలిపి చిత్రం తీసి వదులుతుంటారు. నచ్చినా నచ్చకపోయినా బాగున్నా లేకపోయినా ఆ సిన్మాలు చూడాల్సిందే ప్రేక్షకజనం.

రాజకీయాల్లో వారసత్వం యమా రసవత్తరంగా చేతులు మారుతుంటుంది. దశాబ్దాల తరబడి నియోజకవర్గాన్ని ఏలినవాడు 'పోతే'... భార్యో, కుమారుడో, కుమార్తో, కోడలో రంగంలోకి దిగుతుంది. ముఖ్యమంత్రి అంతటివాడు... 'గడ్డి' కరిచి... బొక్కలో పడినా... దిగులే లేదు. ఆయనగారి భార్యామణి యమ అర్జంటుగా రంగంలోకి దూకి ... సీఎం అయిపోయి కుర్చీని కాపాడుతుందేగాని... కుటుంబాన్ని దాటి పోనివ్వరు.

వాళ్లకంటే సామ్రాజ్యాలున్నాయి. వారసులు ఆక్రమిస్తారు. మరి రాజ్యాలు లేని వారి సంగతో! వారికి నిరుద్యోగ వారసత్వం వుంది. ఇల్లు లేని తనం వారసత్వంగా వుంది. అర్థాకలి వారసత్వంగా వుంది. ఇలా ఎన్నెన్నో వారసత్వాలు. నిజానికి ఈ వారసులే ఎక్కువ.



✡



టపా

ఎన్ని చెప్పినా మారరే!

ఈ వారం సంచికలో మానవా మారవా చాలా బాగా నచ్చింది. ఎంతమంది ఎన్ని విధాలుగా చెప్పినా, ఎన్ని వ్యాసాలు వచ్చినా ఈ మనుషులు మారరు. ఎన్నో సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన. బస్సు కోసం నిల్చు న్నాను. పక్కనే ఒక స్త్రీమూర్తి తుపుక్కున ఉమ్మేసింది. ఏమీ అనలేక పక్కకు జరిగా 'ఏంటి అలా జరుగు తున్నావు? ఏమైనా నీ ముఖం మీద వేశానా? రోడ్డు నీ బాబుదా?" అంటూ ఒకటే తిట్లు. అప్పటికీ ఇప్పటికీ ఏమీ మార్పు రాలేదు. ట్రిమ్ముగా తయారై స్కూటర్ మీద వెళ్తూ పక్కన నడుస్తున్న వారిపై ఉమ్మిన వారిని ఏమని అడగాలి? "పడిపోతే చస్తార్రా. అలా బస్సుల్లో వేళ్లా డకండి" అని చెప్పినా పిల్లలు వినకపోతే ఏం చెయ్యాలి? పక్కింటి వాకిట్లోకి చెత్త ఊడ్చేవారితో ఏమని పోట్లాడాలి? అంత దాకా ఎందుకు బాగా తెలిసిన వారే ఆటోకి యాభై రూపాయలు అయిపోతాయని రాత్రిపూట పిల్లలతో స్కూటర్ మీద వచ్చే వారికి ఏమని చెప్పాలి. చెప్పి చెడ్డ అవడమే తప్ప వాళ్లు మారరు. దుర్ఘటనలు ఎన్ని జరుగుతున్నా మాకు జరగవు అనుకునే మూర్ఖులున్న ఈ ప్రపంచంలో మార్పు ఆశించడం అత్యాశే అనుకుంటా.

డి.వి. తులసి, విజయవాడ.

సాధించారు

పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అనే నానుడికి సరైన నిర్వచనంగా ఉంది ఈవారం 'స్ఫూర్తి'. 700 మంది స్కూలు పిల్లలకు ముగ్గురే ఉపాధ్యాయులుంటే చదువులెలా ఉంటాయో ఒక్కసారి ఊహించుకోవచ్చు. అందుకే ఆ స్కూలు విద్యార్థినులు ఎన్నో సార్లు, ఎంతోమందికి సరిపడేంత ఉపాధ్యాయుల్ని నియమించమని అధికారుల్ని విన్నవించుకున్నాగానీ పట్టిం చుకోలేదు. ఆ తర్వాత స్కూలుకి తాళాలేసి ఒక ఉద్యమంగా వీధుల్లోకొచ్చి బహి రంగంగా తమ సమస్యలను చెప్పినప్పుడే వాటికి పరిష్కారం దొరికింది. ఇలా ఒక్క సారి కాదు.. వాళ్లు అనుకున్నది సాధించే వరకు పట్టుదలను వీడకుండా ఉన్నారు ఆ పిల్లలు. చివరకు అనుకున్నది సాధించారు.

మోహనరావు, ప్రకాశం.

అరుదు

పురస్కార అవార్డులను కూడా కాలదన్నేవాళ్లు ఉంటారని 'తిరస్కార స్వరాలు' చదివితే అర్థమైంది. అలాంటివి చదివినప్పుడు ఒక్కసారి మరలా పునరాలో చించుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే మనుషులుగా పుట్టినప్పుడు ప్రత్యేకంగా గుర్తించి అవార్డులను అందిస్తే కాదనేవారు చాలా అరుదు. కానీ అలా వారికొచ్చిన అవార్డులను కాదని.. అలా ఎందుకు కాదన్నారో కూడా చెప్పడం ఆకట్టుకుంది. నీతి నిజాయితీలతో ఉన్నప్పుడే ఇలాంటివి సాధ్యం అనిపిస్తుంది.

పద్మావతి, తిరుపతి.

వ్యాపార కిటుకు

'గోంగూర బేరం' కథ సహజంగా వుంది. ఎవరైనాగానీ ఏదైనా కొనాలనుకుంటే గీచీ గీచీ బేరమాడతారు. వారు తక్కువకు ఇస్తుంటే మాత్రం ఇంతసేపు అలా బేరమాడినందుకేనని తెగ సంబరపడిపోతారు. కానీ వ్యాపారం చేసేవాళ్లు మాత్రం వారికి లాభం లేనిదే ఏదీ చేయరు. ఆ సూత్రాన్నే కథలో తెలిపింది. ఇక వింతలోకం విశేషాలు బాగున్నాయి.

వెంకట్, అనంతపురం.

ఈ సంచికలో....

ప్రాణ దాతలు

కవర్‌స్టోరీ ———— 14

'యువతరం శిరమెత్తితే... నవతరం గళమిప్పితే లోకమే మారిపోదా ...' అని అన్నారు ఒక రచయిత. అక్షరాల అదే స్ఫూర్తి కాకపోయినా, సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలన్న ఆలోచనలోంచి పుట్టిందే friends2support.org ఫ్రెండ్స్ టు సపోర్ట్.ఓఆర్‌జి) వెబ్‌సైట్. తొమ్మిది సంవత్సరాల క్రితం గుంటూరు జిల్లాలో నవంబర్ 14న పురుడు పోసుకున్న ఈ సంస్థ రక్తదాన రంగంలో భారతదేశంలో ఇప్పుడు సరికొత్త చరిత్రను సృష్టిస్తోంది.

ప్రత్యేకం 4
'ఎగ్ ఫ్రీజింగ్'లో ఎన్ని సమస్యలో!
వింతలోకం 5
యాభై ఏళ్లుగా చెప్పల్లేకుండానే
చూద్దామా 6
అందాల 'బిసంకటక్'
రుచి 7
పనసతో పసందు
కథ 8
ఎండుకొమ్మల నీడ
నవ్వుల్ - పువ్వుల్ 11
సీరియల్ 18
ప్రేమ - విప్లవం
కవిత్వం 21
బాల నేస్తాలు 22
సమ్‌థింగ్ స్పెషల్ 24
మితవాదులపై పోప్ వేటు

స్ఫూర్తి ———— 12



పిల్లలు కాదు! పిడుగులు!!

హలో...

'తోటి మనిషిని చిరునవ్వుతో పలకరించలేనంత బిజీగా ఉన్నామా?!' ఒకానొక సందర్భంలో మదర్ థెరిస్సా అన్న మాటలివి. అందులో ఎంత లోతైన అర్థం వుందో, ఆలోచిస్తే కానీ తెలియదు. హాయిగా పలకరిస్తే ఎంత బాగుంటుంది?! ఆ పలకరింపే లేకపోతే నరకమంటే ఇదేనేమో అన్నంతగా కాలం గడవక కష్టంగా ఉంటుంది. అయినా హాయిగా పలకరిస్తే పోయేదానికి లేనిపోని సమస్యలెందుకు? ఒక చిన్న పలకరింపు పువ్వు వికసించినట్లు అందంగా, అపరూపంగా వుంటుంది! కపటం లేని నవ్వుతో 'హలో, హౌ ఆర్ యు?' అనో, 'ఏంటి, ఎలా ఉన్నారు?' అనో పలకరించి చూడండి. అవతలి వ్యక్తి ఎలాంటి చిరాకు, ఒత్తిడిలో ఉన్నాసరే, వెంటనే మీకు సరెండరైపోయి ప్రేమగా మాట్లాడటం ఖాయం. అంతటి శక్తి ఉంది చిన్న పలకరింపునకు. అందుకే గురజాడ 'ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును' అంటాడు. అందుకే ఒక హలో చాలు. స్నేహ హస్తాన్ని అందిస్తుంది. అమృతాన్ని పంచుతుంది. 'హలో'... అన్న పలకరింపుతో కూడిన పదం పుట్టిన రోజు గురించి...

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హలో పదాన్ని వాడకుండా గంట కూడా గడవదు. ఇంత విస్తృత వాడకంలో ఉన్న 'హలో' పదం 'హలా' అనే ప్రాచీన జర్మన్ పదం నుండి వచ్చింది. ఈ పదాన్ని మొదటిసారి 1833లో 'ది స్కెచెస్ అండ్ ఎస్సెన్‌ట్రిసిటీస్' అనే అమెరికన్ పుస్తకంలో వాడారు. టెలిఫోన్ని కనిపెట్టిన అలెగ్జాండర్ గ్రాహంబెల్ 1877లో 'అహోయ్' అనే పదాన్ని మొదట ఉపయోగించాడు. కొద్దికాలానికి థామస్ ఎడిసన్ ఫోను పలకరింపుగా 'హలోను' అన్నాడు. ఇప్పుడు ఆ పదాన్ని కోటానుకోట్ల మంది నిత్యం జపిస్తున్నారు. తెలియని వ్యక్తిని పలకరించడానికి తెలిసిన వ్యక్తిని పలకరించడానికి అన్ని విధాలుగా అనువైన పలకరింపు హలో.. ఫోన్ లిఫ్ట్ చేసిన ప్రతి ఒక్కరి నోటి నుండి అప్రయత్నంగా వచ్చే మొదటి మాట హలోనే కదా... ఈ పిలుపు ఒక్కో దేశంలో ఒక్కోలా ఉంటుంది. మరి ఈ హలోకి ఒకరోజు ఉంటే బాగుంటుంది కదా!

వరల్డ్ హలో డే

'యుద్ధం ఆపుదాం' అనే ఉద్దేశం నుంచి పుట్టిందే ఈ 'హలో డే'. (నవంబర్ 21).

అసలు యుద్ధమేమిటి... యుద్ధం వలన ఈరోజు పుట్టడమేమిటి అని ఆశ్చర్యం కలగడం సహజమే. హలో డేకి పునాది 1973వ సంవత్సరంలో పడింది. ఆ ఏడాది అరబ్ దేశాలు – ఇజ్రాయిల్ మధ్య యుద్ధం మొదలైంది. యామ్ కిప్పూర్ అనే ప్రదేశం దగ్గర బలగాలు మోహరించిన కారణంగా దీన్ని యామ్ కిప్పూర్ వార్ అని పిలుస్తారు. ఈజిప్ట్, సిరియా నేతృత్వంలోని అరబ్ దేశాలు – ఇజ్రాయిల్ మధ్య ఘర్షణ తీవ్రం కావడం, ఈ నేపథ్యంలో అగ్ర రాజ్యాలైన అమెరికా ఇజ్రాయిల్ వైపు, సోవియట్ రష్యా అరబ్ దేశాలవైపు మొగ్గు చూపడమూ, విరివిగా ఆయుధాలు సరఫరా కావడమూ, ఒక తీవ్రమైన యుద్ధంలోకి ఆ దేశాలు లంఘించడమూ... ఎట్టకేలకు పదహారు రోజుల తర్వాత ఐక్యరాజ్యసమితి చొరవతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. యుద్ధ మేఘాలు తొలగిపోయాయి. ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. హింసకన్నా చర్చల ద్వారానే అన్ని సమస్యలనూ పరిష్కరించుకోవచ్చనీ, మాటల వల్లే దేశాల మధ్య అవగాహన కుదురుతుందనీ నమ్మిన ఇద్దరు సోదరుల ఆలోచనల లోంచి పుట్టిందే ఈ వరల్డ్ హలో డే (ప్రపంచ పలకరింపు దినోత్సవం). మైకేల్ మెక్ కార్మక్, బ్రియాన్ మెక్ కార్మక్ అనే ఇద్దరు ఉన్నత విద్యావంతులైన అమెరికన్లు తమ యౌవనంలో ఈ యుద్ధానికి భీతిల్లి, విభేదాలు ఉన్నా స్నేహంగా మనగలగడం సాధ్యమే అన్న ఆశావాద దృక్పథంతో, యుద్ధం జరిగిన అదే సంవత్సరం 1973లో ఈరోజును ప్రారంభించారు. వ్యక్తిగత స్థాయిలో జరిగే సంభాషణ కూడా ప్రపంచ శాంతి స్థాపనకు సహకారి కాగలదు అని విశ్వసించారు. కేవలం వారు విశ్వసించి వదిలేయలేదు. అలా వారు వదిలేసి ఉంటే మనం ఇప్పుడు వారి గురించి మాట్లాడాల్సిన అవసరం వచ్చేది కాదు. కానీ వారు తమ నమ్మిన విషయాన్ని వివరిస్తూ దేశాధినేతలకు, రాజకీయ నాయకులకు, కళాకారులకు, రచయితలకు ఉత్తరాలు రాశారు దీనిలో భాగం కమ్మని ఆహ్వానించారు. తొలుత పదిహేను దేశాలు స్పందించాయి. కానీ ఇప్పుడు కనీసం 180 దేశాల్లో ఇది ఒక వేడుకైంది అంటే అతిశయోక్తి కాదు. నోబెల్ శాంతి బహుమతి పొందిన ప్రముఖులు కూడా దీన్ని ఒక చక్కటి ప్రయత్నంగా అభినందించారు. రాజకీయ నాయకులు, విధాన నిర్ణేతలను ఆరోజున పలకరించడం, తద్వారా శాంతిని పెంపొందింపజేయడం దీని స్థాపన వెనుక ఉద్దేశం!

వివిధ భాషల్లో హలో...

అత్యధిక భారతీయుల సాధారణ పలకరింపు చేతులు జోడించి నమస్తే చెప్పడం! అంజలి ముద్ర. తమిళులు వణక్కమ్ అనొచ్చు, మరాఠీలు నమస్కార్ అనొచ్చు. పంజాబీలు సత్ శ్రీ అకాల్ అనొచ్చు. అయినా, ఒక మనిషి ఎదురు పడినప్పుడు భారతీయ హలోకు ప్రతీక నమస్తే.

ఇదే పలకరింపును జపనీయులైతే చేతుల్ని తొడలమీద ఉంచి నడుమును ముందుకు వంచడం ద్వారా తమ గౌరవాన్ని ప్రకటిస్తారు. చైనా, కొరియాల్లోనూ తలను వంచడమే సాధారణ పలకరింపు. ఇండోనేషియాలో తెలిసిన మనిషి ఎదురైనప్పుడు 'సలామత్' అని చెప్పుకుంటారు. సలామత్ అంటే శుభం. పరస్పరం శుభాన్ని కాంక్షించడం! కరచాలనం చేసుకోవడం, గౌరవంగా బుగ్గల్ని చుంబించడం కూడా మర్యాదస్తుల పలకరింపులో భాగమే!

- అనంతోజు మోహన్‌కృష్ణ

ప్రత్యేకం

ఇవాళ కెరీర్‌కే పెద్ద పీట. పెళ్లి, పిల్లలు వాయిదా పడిపోతున్నాయి. ఈ బలహీనతనే క్యాష్ చేసుకోవాలని చూస్తున్నాయి కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు. వయసు పైబడ్డా పిల్లల గురించి బెంగ పడక్కర్లేదంటున్నాయి. అందుకోసం మహిళలు తమ అండాలను దాచి పెట్టుకోమని సూచించడమే కాక... ఆర్థిక సాయం చేసేందుకూ సిద్ధమౌతున్నాయి. అండాల శీతలీకరణ (ఎగ్ ఫ్రీజింగ్) వెనక వున్న అసలు సమస్యల సంగతి మాత్రం ప్రస్తావించడం లేదు.

'ఎగ్ ఫ్రీజింగ్'లో ఎన్ని సమస్యలో!

టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ కొత్త కొత్త వింతలు పుంతలు తొక్కుతున్నాయి. కొన్ని బాగానే ఉన్నా, ఇంకొన్ని ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ఇటీవల ఇటువంటి వింత విశేషం వార్తలకెక్కింది. టెక్నాలజీ దిగ్గజాలైన ఫేస్ బుక్, యాపిల్ కంపెనీలు తమ ఉద్యోగినులు తమ తమ అండాలను గనక తరువాత వాడుకోడానికి దాచుకుంటే వారికి ఇరవై వేల డాలర్లు అందిస్తామని ప్రకటించాయి.

'అండ నిక్షేపం' గురించి చెప్పడానికి సులభంగానే ఉంటుంది. స్త్రీలలో విడుదలయ్యే గుడ్లను తీసి వాటిని ఘనీభవించి నిక్షిప్తం చేయడం. మళ్ళీ వాటి అవసరం వచ్చినపుడు తీసి గర్భం దాల్చవచ్చు.

ముందుగా వైద్యులు సదరు మహిళ హార్మోన్‌ల స్థాయిలను తెలుసుకోడానికి రక్తపరీక్ష చేస్తారు. ఆ తరువాత స్త్రీలో అండాలు రూపొందే క్రమంలో ఎన్ని కణాలు ఉన్నాయో నిర్ధారిస్తారు. అనంతరం ఫెర్టిలిటీ మందులను శరీరంలో ప్రవేశపెడతారు. ఒకటి రెండు వారాల పాటు జరిగే ఈ ప్రక్రియలో స్త్రీలలో అండాలను ఉత్పత్తి చేసే "ఫాలికిల్స్" పెరుగుతాయి. అవి పరిణితి చెందాక, గుడ్లను వెలికి తీసే 24 లేదా 32 గంటల ముందు మరో హార్మోన్ ఇస్తారు. అండాలను సంగ్రహించడం ఈ మొత్తం కార్యక్రమంలో సులువైన ప్రక్రియ. మత్తు మందు ఇచ్చి సన్నని సూది ద్వారా ఫాలికిల్స్ నుండి గుడ్లను సేకరిస్తారు. ఇది ఒక అరగంటలో అయిపోతుంది. ఆ తరువాత రెండు మూడు రోజులు కడుపు నొప్పి రావచ్చు. బయటకి తీసిన గుడ్లను వెంటనే ఫ్రీజ్ చేస్తారు. అయితే వాటి చుట్టూ మంచు స్ఫటికాలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతె గుడ్లు దెబ్బతింటాయి. ఇలా నిక్షిప్త పరచిన గుడ్లు దాదాపు పది సంవత్సరాల వరకూ విజయవంతమైన గర్భాన్ని అందించగలవని చెప్తున్నారు. ఇదంతా నాణేనికి ఒక వైపు మాత్రమే.

రెండవ వైపు అనేకానేక అనుమానాలు, సమస్యలు వున్నాయి. ఈ విషయంలో అనుభవాలు కూడా భిన్నంగా ఉన్నాయి. చాలామందికి నిక్షిప్తం చేసిన అండాలు గర్భాన్ని ఇవ్వలేదు. పైగా, ఒక వేళ గర్భం దాల్చినా, అటువంటి ఆండాల ద్వారా జన్మించిన శిశువులు సమస్యలతో ఉంటారనే వార్తలూ వున్నాయి. అలాగే గుడ్లను తీయించుకున్న మహిళలు కూడా ఆరోగ్య సమస్యలతో సతమతమౌతారన్నది మరొక అధ్యయనం.

అండ నిక్షేప ప్రక్రియ అంత చవకేం కాదు. ఒక అండాశయాన్ని ఉత్తేజ పరచడానికే కనీసం పదివేల డాలర్ల ఖర్చు అవుతుంది. ఇక ఒక అండాన్ని భద్రపరచడానికి ఏడాదికి అయిదు వందల డాలర్లు అవుతాయి.

ఇటువంటి ప్రక్రియ కొన్ని సందర్భాలలో ఉపయుక్తంగా ఉంటుంది. సంతాన లేమి సమస్యలో అండాలను భద్రపరచి, శరీరం బయట ఫలదీకరణ చేసి, మళ్ళీ శరీరంలో ప్రవేశపెట్టి గర్భం దాల్చే అవకాశం ఉంది. అయితే, ఈ తరహా గుడ్లను సంగ్రహించడం అనే క్రమంలో వాడే అనేక హార్మోనులు ఇతర మందులు చేసే హాని గురించి ఇంతవరకూ సరైన సమాచారం లేదు. కాని కచ్చితంగా చాలా అనూహ్యమైన అవాంఛనీయ ప్రభావాలు కలిగే ప్రమాదం మాత్రం వుంది అని వైద్య నిపుణులు అంటున్నారు.

ఇంతకీ బడా కంపెనీలు ఇలా తమ మహిళా ఉద్యోగులను ఆశ చూపి మరీ తమ అండాలను నిక్షిప్తం చేయించడానికి కారణం? పిల్లలు పుడితే తమ కంపెనీల్లో పని దెబ్బతింటుందని, అందుకని మహిళా ఉద్యోగులు తమ "మాతృత్వాన్ని" వాయిదా వేయాలన్నది. అందుకు ప్రోత్సాహంగా వేలాది డాలర్ల ఎర.

తమ కెరీర్‌ను కుటుంబం కంటే మిన్నగా ఎంచుకునే వారికి ఇటువంటి వెసులుబాటు బాగానే వుంటుంది. తమ ఉద్యోగాలలో, ఇతర కార్యక్రమాలలో స్వేచ్ఛ, స్వతంత్రం లభించడం అనే ఆలోచనతో కొందరు ఇటువంటి పనులకు పూనుకుంటున్నారు కూడా. "మీ అండాలను ఘనీభవించుకోండి, మీ కెరీర్ ను స్వతంత్రం చేసుకోండి" అనే నినాదాలు కూడా పుట్టాయి.

పారిశ్రామిక విప్లవం తొలి దశల్లో కూలీలను, సరైన సమయానికి రావడం, ఎక్కువ పని చేయడం, తక్కువ సెలవలు తీసుకోవడం వంటి యాజమాన్య పద్ధతులకు అనుగుణంగా మలచుకోడానికి కొన్ని సార్లు బెదిరించి, కొన్ని సార్లు బహుమతులు ఎర చూపి సాధించుకునే వారు. టెక్ పరిశ్రమలు వచ్చాక పనిగంటలు, పని తీవ్రత, పని స్థలాలు అన్నీ తిరగ రాసి, ఇప్పుడు మరింత ఒత్తిడి కలిగిస్తున్నారు.

అదే ఇరవై వేల డాలర్లను పుట్టిన పిల్లల బాగోగులు చూడటానికి ఒక ఆయాకి ఇస్తే, తల్లులు తమ ఉద్యోగాలకు నిరంతరాయంగా వెళ్లి రావచ్చు కదా. లేదా ఈ బడా కంపెనీలే తమ పేరు మీద 'డే కేర్ సెంటర్ల'ను నెలకొల్పడం సమస్యకు మరో పరిష్కారం.

- డా॥ కాకర్లమూడి విజయ్

◆ వింతలోకం

యాభయ్యేళ్లగా చెప్పల్లేకుండానే....

ఇప్పుడు ఇళ్లల్లో కూడా చెప్పులేసుకుంటున్నారు. అన్నీ వున్నా...కొనుక్కోగల స్థోమత వున్నా... చెప్పులు, బూట్లు లేకుండానే గడిపేస్తున్నాడు పీట్ మెకంజీ. అదీ యాభై ఏళ్లగా. ఇప్పుడాయనకు అరవై తొమ్మిదేళ్లు. బ్రిటన్ వాసులకు ఇదేమంత పెద్ద వార్త కాదు. ఎందుకంటే పాదరక్షలు లేకుండా సంచరించే పీట్ గురించి వారికి బాగా తెలుసు. చిన్నతనంలోనే ఈ అలవాటు చేసుకున్నాడు పీట్. తల్లి ఎంతగానో చెప్పి చూసింది. చెప్పులు వేసుకోమని, బూట్లు తొడుక్కోమని. కానీ వింటేగా. పైగా కాలి వేలి గోళ్లకు రకరకాల గోళ్ల రంగులు వేసుకుంటాడు. అదో ఆకర్షణ. అతని భార్యా పిల్లలకు ఇదసలు పట్టించుకోవాల్సినంత, ఆలోచించాల్సినంత విషయమే కాదు. 'చలికాలంలో కూడా నేను బూట్లు వేసుకోను. ఇలా వట్టి కాళ్లతోనే నడుస్తాను. నా పాదాలు వెచ్చగానే వుంటాయి. మిగతా అందరూ సాక్సులు, బూట్లు తొడుక్కుంటారు కనక వాళ్లకు బయటి వాతావరణం చల్లగా అనిపిస్తుంది. కానీ నాకు బూట్ల అలవాటు లేదు కనక ... వెచ్చగానే వుంటుంది' అంటాడు.

ఎలుగుతో సెల్ఫీ

ఈ మధ్య సెల్ఫీల గోల ఎక్కువైపోయింది. ఎక్కడ వున్నా...ఏం చేస్తున్నా సెల్ఫీలు తీయడం, వీడియోలు తీసుకోవడం... ఫేస్‌బుక్‌లోనో, ట్విటర్‌లోనో పెట్టేయడం పరిపాటి అయింది. కాకపోతే కాలిఫోర్నియాలోని అటవీ విభాగం వారికి ఇదో పెద్ద సమస్య అయ్యింది. నిషేధిత అటవీ ప్రదేశాల్లో కార్లల్లోంచి బయటకు వచ్చి ... ఎలుగు బంట్లకు బాగా దగ్గరగా వెళ్లి... ఫొటోలు దిగడం ... ఆపలేక అవస్థలు పడాల్సి వస్తోంది. నిజానికి ఎలుగుబంట్లు కంటికి కనిపించేంత నిదానంగా వుండవు. అవి దాడి చెయ్యాలీ అని ఒకసారి అనుకున్నాయో! కంటికి కనిపించనంత వేగం వుంటుందట వాటిలో. సరదాగా కెమెరాలో ఫొటోలు తీసుకుంటున్న మనం వాటి వేగాన్ని గుర్తించి తప్పించుకోలేం. అలా ఎంతో మంది ఎలుగులకు ఎరలైన ఘటనలూ వున్నాయనుకోండి. జీవం అంటూ వుంటేనే సెల్ఫీలైనా... ఏదైనా! ప్రాణాలతో చెలగాటం ఎందుకట!

బేట్‌మేన్ కారు

కార్టూన్ ఛానళ్లు ఎక్కువగా చూసే చిన్నారులకు పెద్దయ్యాక కూడా ఆ ఇష్టాయిష్టాలు పోవేమో! ఆస్ట్రేలియాకు చెందిన జాక్ మిహజాల్వీకి బాల్యంలో బ్యాట్‌మేన్ అన్నా, అతను ఉపయోగించే కారన్నా మహా ఇష్టమట. ఇప్పుడతనికి దాదాపు మూడు పదుల వయసు. అయినా ఇంకా బ్యాట్‌మేన్ డ్రస్సన్నా, అతను వాడే కారన్నా మహా ఇష్టం. అందుకే 1989లో మైఖేల్ కీటన్ హీరోగా నటించిన బ్యాట్‌మేన్ చిత్రం విడుదలయ్యే నాటికి జాక్‌కు ఐదేళ్లు. ఇన్నేళ్లయినా ఆ కారుని ఎన్నడూ మర్చిపోలేదు. అలాంటి వాహనాన్ని తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇంజనీర్‌గా రిటైర్ అయిన తన తాత సాయంతో పని ప్రారంభించాడు. కేవలం విడిభాగాల సేకరణకే రెండేళ్లు పట్టిందట. ప్రాజక్టు పూర్తి చేయడానికి మరో రెండేళ్లు తీసుకుంది. అయితేనేం! తను అనుకున్న పద్ధతుల్లో బ్యాట్‌మేన్ కారు తయారు చేశాడు జాక్. దాన్ని చూసి ఎంత మంది మనసు పారేసుకున్నారనీ! ఆఖరుకు దుబాయ్ షేక్ కూడా! ఆ కారు ఇస్తే కోరుకున్నది ఇస్తామని కబురు పెట్టారు. ఊహూ...మనోడు ఏమాత్రం కరగలేదు. పైగా ... నయం కాని జబ్బులతో చావు అంచుల్లో వున్న చిన్నారుల చివరి కోర్కె తీర్చడానికి తన బ్యాట్‌మేన్ కారును ఉపయోగించసాగాడు జాక్. ఇది తనకు ఎంతో తృప్తినిస్తోందంటా మెరుస్తున్న కళ్లతో.

లాండ్రీ ఉచితం

ఎక్కడ...అని బట్టలు సర్దేసుకోకండి. ఆ సౌకర్యం వున్నది ఆస్ట్రేలియాలోని బ్రిస్‌బేన్ నగరంలో. అదీ ఇళ్లు లేనివారికి మాత్రమే. అంటే రోడ్లమీద రోజులు గడిపేవారి కోసం. సంచార లాండ్రీ సౌకర్యాన్ని ఉచితంగా అందివ్వాలన్న ఆలోచన ఇంజనీరింగ్ విద్యార్థులైన లూకాస్ పాచెట్, నికొలస్ మార్చెన్‌కు వచ్చింది. వెంటనే ఒక వాహనంలో రెండు వాషింగ్ మెషీన్లను (ఎవరో దానం చేసినవే లెండి) డ్రయ్యర్లతో సహా బిగించేశారు. ఇక నగరంలోని మురికివాడల్లో తిరుగుతూ ఫ్రీగా లాండ్రీ పని చేయసాగారు. గంటకు ఇరవై కిలోల బట్టలను ఉతికి ఎండబెట్టి బయటికి పంపిస్తాయా వాషింగ్ మెషీన్లు. మొదట్లో వీటి దగ్గరకు రావడానికే జంకేవారట స్థానిక నిర్వాసితులు. లూకాస్, నికొలస్ మాటలతో వారు మెల్లగా తమ బట్టలను ఉతికించుకోవడానికి ముందుకు రాసాగారు. ఒక్కసారి మురికి బట్టిన బట్టల్లోంచి పరిశుభ్రమైన వాటిలోకి మారాక ఎంతో హాయిగా వుందని చెప్తున్నారట. మామూలుగా బయట లాండ్రీలలో చేయించుకుంటే ఒక్క లాండ్రీ ఉతుకుకు 5 నుంచి 6 డాలర్ల వరకు ఖర్చు అవుతుందట. అంత డబ్బు పెట్టగలిగిన పరిస్థితుల్లో లేని వారు ఉచిత లాండ్రీ సౌకర్యాన్ని అపురూప అవకాశంగా భావిస్తున్నారు. మరి ఆరోగ్యంగా వుండాలంటే పరిశుభ్రంగా వుండాలిగా.

◆ చూద్దామా

అందాల 'బిసంకటక్'

ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసే అందాల ప్రదేశం ఒడిశాలోని 'బిసంకటక్'. దారి పొడవునా దట్టమైన, చూడముచ్చట గొలిపే చెట్లు.. వాటి మధ్యలో పచ్చదనాన్ని కప్పకుంటూ ఎత్తయిన కొండలూ.. ఆ కొండలపై నుంచి గలగల పారే సెలయేళ్లు.. సహజ సిద్ధమైన జలపాతాలు ఎవరినైనా కట్టిపడేస్తాయి. మనస్సులను పరవశింపజేస్తాయి. ఇంతటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఇంతకాలం ఎందుకు చూడలేదా అనిపించిందంటే ఆశ్చర్యమే మరి.

విజయనగరం, పార్వతీపురం ప్రాంతాల నుంచి సుమారు 30 మందిమి కలిసి ఈ విహారయాత్రకు బయల్దేరాం. మేం ఎక్కిన పాసింజరు రైలు విజయనగరం రైల్వేస్టేషన్ నుంచి తెల్లవారుజామున 4.30 గంటలకు బయల్దేరింది. పార్వతీపురం, కొమరాడ, గుమడ రాయగడ మీదుగా తెరువలి నుంచి 'బిసంకటక్'కు ఉదయం 10 గంటలకు రైలు చేరుకుంది. చాలా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆ స్టేషన్ మీదుగా వెళ్లినా అక్కడ మాత్రం ఆగవు. ఢిల్లీ వెళ్లే రైలు మార్గం కూడా ఇదే అయినప్పటికీ ఆ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లేమీ ఆగవు. పాసింజరు రైలులోనే ఎవరైనా ప్రయాణం చేయాల్సి ఉంటుంది.

బిసంకటక్ ఎత్తైన ప్రదేశంలో ఉండడంతో... వాతావరణం చల్లగా వుంటుంది. రైల్వేస్టేషన్ నుంచి సుమారు కిలోమీటరున్నర దూరంలో కొండగుహల్లోని 'చటుకొన' చూడదగినది.

బిసంకటక్ రైల్వేస్టేషన్ నుంచి చటుకొనకు నడిచేవారు నడుస్తూ, జీపుల్లో వెళ్లేవారు వెళు తుంటారు. పెద్ద దూరం కాదు కాబట్టి మేమంతా నడిచే వెళ్లాం.

ఎత్తయిన కొండలు, పచ్చటి చేల మధ్యనే ఈ ప్రయాణం అరగంట సేపు సాగుతుంది. దారిపొడవునా గిరిజనులు సహజసిద్ధంగా పండించే వరి పొలాలు కోతకు సిద్ధంగా ఉండడంతో అక్కడ వీచే గాలికి వరి కొంకులు వయ్యారంగా ఊగుతూ నాట్యం చేస్తున్నట్లు కనిపిస్తాయి. హుదూద్ ప్రభావంతో విజయనగరం, విశాఖపట్నంలో సహజసిద్ధమైన వృక్షసంపద నాశనం కావడంతో... 'బిసంకటక్'లోని పచ్చదనం వాతావరణం మనస్సును రంజింపజేసినట్టయింది.

ఇక్కడి ఈశ్వరుడి లింగం, కొండల చుట్టూ జలపాత దృశ్యాలు (వాటర్‌ఫాల్స్) పర్యాటకులను ఇట్టే ఆకట్టుకుంటాయి. పార్వతీపురం మొదలుకుని కొమరాడ, గుమడ ప్రాంతాల దాటిన తర్వాత నుంచి రైలు కొండలపైకి వెళ్తున్న అనుభూతి కలుగుతుంది. కొండకు చేరుకోగానే వెళ్లిన వాళ్లమంతా అక్కడి జలపాతాలను చూసి ఒక్కసారిగా పెద్దవాళ్లమన్న సంగతే మరచిపోయాం. పిల్లల సంగతి ఇక చెప్పాలా? జలపాతాల దగ్గర జలకాలాడేందుకు వారు పడ్డ ఆరాటం వర్ణనాతీతం. మేం అక్కడకు వెళ్లేసరికి కొండలపై సెలయేటి నుంచి పారే జలపాతంలో ఒరియా పిల్లలు 'రింగు కట్టుకుని' ఎత్తు నుంచి కిందకి నీట్లోంచి జారడం అందరినీ ఆకట్టుకుంది. కొండ మీద ఈశ్వరాలయం దగ్గర పెద్ద జలపాతం వుంటుంది. ఈ అందాలను చూసిన పర్యాటకులు మరో ప్రపంచంలో విహరించినంతగా మైమరచిపోతారు. కార్తీక మాసపు వన భోజనాల సందడి ప్రారంభం కావడంతో టూరిస్టుల సరదాకు ఆకాశమే హద్దు.. అయితే ఇక్కడకు రావాలన్న సంగతి కూడా ఆంధ్రప్రాంతంలో ఉన్నవారికి అంతగా తెలియదు. అరకులో కనిపించే పసుపురంగు పూలు తప్ప మిగతా సుందర దృశ్యాలన్నీ బిసంకటక్‌లో సాక్షాత్కరిస్తాయి. పైగా ఓ అతిపెద్ద విహారయాత్రకు వచ్చామన్న సంతృప్తి కలుగుతుంది.

మనసును ఆహ్లాదపరిచే సుందర వాతావరణం, ఒక్కసారైనా ఆ జలపాతంలో తడవకపోతే వృథా అని తోచే ఆ ప్రాంతానికి.. వెంట వచ్చిన పిల్లల్ని అదుపు చేయడం పెద్దల తరం కాలేదు. పెద్దలమంతా పిల్లల సరదా, సంతోషాన్ని ప్రకృతి అందాలను చూస్తూ ఆనందంలో గడిపేసరికి మధ్యాహ్నం మూడయ్యింది. అక్కడి నుంచి తిరిగి రైల్వేస్టేషన్‌కు పక్కగానే ఇంటిని మరిపించే హోటల్‌లో మధ్యాహ్నం విందు చేశాం. ఒడిశా రుచుల్లో ఉప్పు, కారం, నూనె తక్కువగా ఉండడంతో కొంతమంది అలవాటు లేక ఇబ్బందిపడినప్పటికీ వారు తయారుచేసిన సాంబారు ఆంధ్రా వంటకంలా అందరికీ ఆకట్టుకుంది. మళ్లీ ఐదు గంటలకు బిసంకటక్ నుంచి తిరుగు ప్రయాణానికి రైలు సిద్ధంగా ఉంది. అప్పటి వరకు చూసిన ప్రకృతి అందాలను గుర్తుచేసుకుంటూ మా రైలు ప్రయాణం సాగింది. అదేరోజు రాత్రి 10గంటలకు ఇళ్లకు చేరుకున్నాం.

తెల్లారితే చాలు! మీద పడే నిత్యజీవితంలోని పనులతో ఏది ఎలా మొదలెట్టాలో, దేనికెంత సమయం వెచ్చించాలో తెలీక సతమతమయ్యే మాకు ఈ యాత్ర మానసిక ఉల్లాసాన్ని కలిగించడమే కాదు.. నూతనోత్సాహంతో పనిచేయడానికి కావాల్సిన శక్తినిచ్చింది.

- కె.శ్రీలత, విజయనగరం.

పనసతో పసందు

పులిహోర కూర

కావలసినవి: పనసపొట్టు : 2 కప్పులు, చింతపండు రసము : 1/2 కప్పు, అల్లం పేస్ట్ : 2 చెంచాలు, ఎండుమిర్చి : 5, కరివేపాకు: కొంచెము, ఉప్పు: 2 చెంచాలు, మినపప్పు, శనగపప్పు : 4 చెంచాలు, ఆవాలు : 2 చెంచాలు, నూనె : 5 చెంచాలు, పచ్చిమిర్చి : 5

తయారీ విధానం : ముందుగా పనసపొట్టు ఉప్పు వేసి ఉడికించి పిండి పక్కన పెట్టాలి. నూనె వేసి పోపు వేసిన తర్వాత, కరివేపాకు కూడా వేసి వేయించిన వెంటనే చింతపండు రసం పోసి ఉడికించాలి. ఇప్పుడు దానిలో ఉడికించిన పనసపొట్టు వేసి కలిపి దింపాలి.

పనసపొట్టు వడలు

కావలసినవి : పనసపొట్టు : 2 కప్పులు, శనగపప్పు : 1 కప్పు, అల్లం : చిన్న ముక్క, ఉప్పు : 2 చెంచాలు, మిర్చి : 5, నూనె : 250 గ్రాములు, వేరుశనగపప్పు: 1/4 కప్పు, కొబ్బరి కోరు : 1 కప్పు, బియ్యం పిండి : 1/2 కప్పు.

తయారీ విధానం : ముందుగా పనసపొట్టు ఉడికించి నీరు పిండాలి. శనగపప్పు నానబెట్టి ముద్దగా పిండిలా రుబ్బుకొని, దానిలో బియ్యంపిండి, వేరుశనగపప్పులు కలిపి, మిర్చి, అల్లము, కొబ్బరికోరు కలిపి చివరగా ఉడికించిన పనసపొట్టు కలిపి వడలుగా చేసుకొని నూనెలో వేయించాలి. ఈ వడలను టిష్యూ పేపర్ మీద వేస్తే నూనె పీల్చుకుంటాయి. ఇప్పుడు పనసపొట్టు వడలు తినడానికి రెడీ.

పనసపొట్టు ఆవకాయ

కావలసినవి : పనసపొట్టు : 2 కప్పులు, మామిడి ముక్కలు: 2 కప్పులు, ఆవపిండి : 1 కప్పు, కారము : 1 కప్పు, ఉప్పు : 1 కప్పు, నూనె : 2 కప్పులు.

తయారీ విధానం : ముందుగా మామిడి

ముక్కలు పనసపొట్టు బాగా కలిపి, కారం, ఉప్పు, ఆవపిండి, నూనె పోసి కలిపి మూడు రోజులు మూత పెట్టాలి. ముక్కలకు కారం, ఉప్పు పట్టేలా కలియ తిప్పాలి. అంతే పనసపొట్టు ఆవకాయ్ సిద్ధమైనట్టే. ఇది నిల్వ కూడా ఉంటుంది.

పనసపొట్టు బుల్లెట్స్

కావలసినవి : పనసపొట్టు : 2 కప్పులు, మైదాపిండి : 1/2 కప్పు, బియ్యంపిండి : 1/2 కప్పు, జీలకర్ర : 1 చెంచా, మిర్చి :5, అల్లం : 2 చెంచాలు, మసాలా కారము: 5 చెంచాలు, నూనె : 250 గ్రాములు.

తయారీ విధానం : పనసపొట్టును ఉడికించి మిక్సీ పట్టాలి. దానిలో పచ్చిమిర్చి, అల్లం, మసాలా కారం బియ్యంపిండి, మైదాపిండి వేసి ముద్దగా కలిపి చిన్న చిన్న బుల్లెట్స్‌లా చేసి నూనెలో వేయించి తియ్యాలి.

పనసపొట్టు గారెలు

కావలసినవి : పనసపొట్టు : 2 కప్పులు, మినపప్పు : 2 కప్పులు, అల్లం : చిన్న ముక్క, ఇంగువ : చిన్నముక్క, పుదీనా ఆకు : 2 కప్పులు, నూనె : 250 గ్రాములు, వేరుశనగ పప్పు : 1/2 కప్పు, జీలకర్ర : 1 చెంచా, ఉల్లి ముక్కలు : 1 కప్పు, కొబ్బరి : 1/2 కప్పు.

తయారీ విధానం : మినపప్పు నానబెట్టి పిండిగా రుబ్బి, పనసపొట్టు, కొబ్బరి, అల్లము, వేరుశనగపప్పులు అన్నీచేర్చి ముద్దగా మిక్సీ పట్టాలి. దాన్ని గారెలుగా చేసుకొని నూనెలో వేయించాలి.

- వాణి ప్రభాకరి



ఎండుకొమ్మల నీడ

వేంపల్లి సికిందర్

ఫోన్:9666426875

◆ కథ

ఆదివారం ! సాయంత్రం కావస్తూ ఉంది. పొద్దుట్నుంచీ ఇంట్లో పనులతోటే సరిపోయింది. తను రిలాక్స్ అవుతున్నట్టుంది.

హాల్లో వాలు కుర్చీలో వాలి నింపాదిగా వార పత్రిక చదువుకొంటున్నాను.

'ఏవండోయ్... షాపింగ్‌కెళదాం, మళ్లీ వీలు చిక్కకపోవచ్చు. ఆఫీసుల్లో ఎప్పుడు వర్కే. బిజీ ఉద్యోగాలు' ఫర్మానా వినవచ్చింది. అయిష్టత అడ్డొచ్చినా బయల్దేరక తప్పలేదు.

ఫ్లాటుకు తాళం వేసి – అపార్టుమెంటు గేటు దాటి డి.ఆర్. మహల్ రోడ్లోకొచ్చాం. డి.ఆర్. మహల్ సెంటరులో టి.వి.యస్. షోరూం దాక ఒకటే జనం. కిక్కిరిసిన ట్రాఫిక్...

సైకిలు, రిక్షాలు, తోపుడు బండ్లు అడ్డదిడ్డంగా వున్నా, పద్మవ్యూహం ఛేదించుకొచ్చినట్టు, బతకు జీవుడా అనుకొంటూ స్టేషను రోడ్డులోకొచ్చి చేరాం. తిరిగి ట్రాఫిక్‌లో అతికష్టం మీద గెస్ట్‌హౌస్ దాటి రైల్వేస్టేషన్ మెయిన్ బిల్డింగ్ దాక వచ్చి చేరాం... పార్క్ చేసిన వాహనాలు, కదిలే కార్లు... ఆటోలు, చిన్నా చితకా... వాహనాలు గందరగోళంగా ఉంది.

అపరిమిత వేగంతో జనాల మధ్య నుంచి తారాజువ్వల్లా దూసుకుపోతున్న సిటీ బస్సులు, కొండ బస్సులు... అడ్డదిడ్డంగా పరుగులు పెడుతున్న యాత్రికుల గుంపులు... పరిస్థితి మొత్తానికి భయపెడుతున్నా... అక్కడక్కడా భజన బృందాలు... భక్తులు చేసే గోవిందనామ స్మరణం భజన పాటలు... కాస్త రిలీఫ్ అనిపించింది.

నడుచుకొంటూ టిటిడి మొదటి సత్రం దాకా వచ్చాం... అక్కడ ఎ.పి. టూరిజం వారి ప్రకటన నన్నెంతో ఆకర్షించింది. ప్యాకేజ్

"అమ్మా నేను అడుక్కొనే స్థితికి ఎందుకు వచ్చానో మనవి చేసుకోవాలి. మాదీ ఒకప్పుడు కాస్త జరుగుబాటుగల కుటుంబమే... కానీ మా సీమలో వర్షాలు రాక పంటలు పండక కుటుంబం క్రమంగా చితికిపోసాగింది. నేను పది దాక చదువుకొన్నాను. నాకు పెళ్లి చేసి మావాళ్లు బరువు దించేసుకున్నారు. సంవత్సరాల తరబడి వానలు కురవక కరువొచ్చింది. కన్నతల్లి ఒడిలాంటి మా పొలాలు బీళ్లు పడి, బీటలు వారాయి. తల్లిలా పాలిచ్చి పోషించిన గోమాతలు గోడుమంటూ కబేళాలకు తరలించబడ్డాయి. ఎండలకు తాళలేని గుడిసెలు మంటలకు మండి మసైనాయి."

టూర్ వివరాలు చదువుతూ... క్షణం ఆగాను...

'ఎక్కడ బడితే అక్కడ ఏదో చదువుతూ ఆగిపోతారు. చాల్లెండి సంబడం. ఇలా అయితే ఇహ మనం వెళ్లినట్టే. పుణ్యకాలం కాస్త గడిచిపోతుంది. పదండి... పదండి" అంది మా శ్రీమతి తొందరపెడుతూ. అప్రయత్నంగా అడుగులు ముందుకు పడ్డాయి. కాసేపయ్యాక వెనుదిరిగి చూస్తే ను ఫుట్ ఓవర్ బ్రిడ్జి దగ్గరే నిలబడి ఉంది. విషయం తెలియక వెనక్కి వెళ్లాను.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి మొదట్లో మెట్ల దగ్గర అడుక్కొనే ఒక అమ్మాయిని దీక్షగా చూస్తూ ఉంది. మా ఆవిడ మనసు నాకు తెలుసు. మాట కరకు, మనసు వెన్న. ఆ అమ్మాయికి ఏదో సహాయం చేయాలనుకుంటూ ఉంటుందనే ఊహించాను. అయినా విషయమేమిటన్నట్లు ఆవిడవైపు చూశాను. ఇదేమీ ఆమె గమనించేట్లు లేదు.

'ఫ్లాటు తాళాలివ్వండి. ఇంటిదాకా వెళ్లి వస్తాను' అంది. మారు మాట్లాడకుండా జేబులోంచి తాళాలు తీసి ఇచ్చాను. విసవిసా వెళ్లిపోయింది.

ఆవిడ వచ్చేదాకా అక్కడే నిలబడాల్సి వచ్చింది. ఈ మధ్యలో మా ఆవిడ సానుభూతి పొందిన అడుక్కుతినే ఆ అమ్మాయి వైపు

పరిశీలనగా చూశాను. తైల సంస్కారానికి నోచుకోక తల జుట్టు మట్టి కొట్టుకొని, ఉండలు పోయి ఉంది. వయసు ఇరవైలోపే ఉంటుంది. జాకెట్ రంగు వెలిసి... పిగిలిపోయి వీపు.... చీర చిరుగుల్లోంచి మసిబారిన లంగా కనిపిస్తూ ఉంది. శరీరం మొత్తం చెమటతో తడిసి పీలికలు కప్పుకొన్న మాంసపు ముద్దలా ఉంది తప్ప మనిషిలా కనిపించడం లేదు.

లోతట్టు కళ్లతో, ఆర్తిని నింపుకొని, మెట్లు దిగివచ్చే వారి, ఎక్కి వెళ్లే వారి కాళ్లావేళ్లాబడి దీనంగా అడుక్కొంటూ వుంది.

ఇంతలో మా శ్రీమతి వచ్చింది. వేగంగా వెళ్లి రావటం వల్ల ఆయాసపడుతూ ఉంది. చేతిలో మడతపెట్టి తీసుకువచ్చిన చీర ఉంది. అంచులు పమిట, పైన జరీరంగు పూల ఎంబ్రాయిడరీ ఉంది. గులాబీ రంగుది. కానీ చాలా పాతది. తనకీ చీర అంటే చాలా ఇష్టం.

తనీ చీర కట్టుకొన్నప్పుడల్లా 'చీర రంగు డిజైను నీకు చక్కగా అమరింది మమ్మీ. చాలా బావుంది' అంటూ మా అమ్మాయి మెచ్చుకొనేది. ఆ చీర చూడగానే నా జ్ఞాపకాల్లో లండన్‌లో వున్న మా అమ్మాయి కదలాడింది.

అర్థమయ్యింది... 'బహుశా పాప ఈడుదే అయినా ఈ అడుక్కునే అమ్మాయిని చూసి జాలిపడి, పాపకు మంచి జరగాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ పాపను గుర్తు తెచ్చుకొని ఉండి ఉంటుంది. అప్రయత్నంగా ఈ అమ్మాయి మీద జాలి పొంగుకొచ్చినట్లుంది'. ఆలోచనల నుంచి బయటపడుతూ... తేలిగ్గా శ్వాస తీసుకుంటున్న మా శ్రీమతి వైపు చూస్తూ విషయమేమిటన్నట్లు కళ్లతోనే ప్రశ్నించాను. సమాధానంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి మెట్ల దగ్గర ఆ అమ్మాయిని చూపిస్తూ 'ఏవండీ ఆ అమ్మాయి ఎంత దీనంగా ఉందో చూడండి. ఈ చీర చూశారుగా... మడతలో జాకెట్టు కూడా ఉంది. ఇది తనకిచ్చామంటే తీసుకొని సంతోషిస్తుంది. రండి ఇచ్చి వెళదాం' అంది రోడ్డు క్రాస్ చేస్తూ ఇద్దరం ఆ అమ్మాయి దగ్గరకెళ్లాం.

'అమ్మా బాబు దిక్కులేని దాన్ని.. భోంచేసి మూన్నాళ్లయింది... ఆకలి.. ధర్మాత్ములు, ఎంతో కొంత చిల్లర ఇచ్చి పున్నెం కట్టుకోండి... అంటూ నిస్సత్తువ నటిస్తూ రొప్పుతూ... రాగాలు తీస్తు... బొచ్చె ఆడించడం మొదలెట్టింది ఆ అమ్మాయి. ఆ అమ్మాయి ధోరణి నాకు విసుగు తెప్పిస్తోంది.

అయినా మా శ్రీమతి ఓపిగ్గా ఆ అమ్మాయితో... 'అమ్మాయ్! రూపాయి అర్థ రూపాయితో నీ అవసరం ఏం తీరుతుంది. ఇదిగో మంచి చీరా జాకెట్టు... తీసుకో... రేపటి రోజు మేమేదో టైంలో ఇటుగా వస్తాం. కట్టుకొని కనిపించు సంతోషిస్తాం' అంటూ సమాధానం కోసం ఎదురు చూడకుండా వంగి చీర అందివ్వబోయింది.

దానికి ఆ అమ్మాయి వికారంగా మొహం పెట్టి... మా ఇద్దరి వంక మార్చి మార్చి చూస్తూ వెనక్కి జరిగి 'ఏవమ్మోయ్! నేనెపుడడిగాను చీర జాకెట్టు మిమ్మల్ని?! చాలుగాని ఎల్లెల్లవమ్మా... మీ చీరా జాకెట్టు మాకక్కర లేదు... మాకున్న బట్టలే మాకు చాలు..

"మీరు నాకు చీర ఇవ్వజూపిన రోజు దాకా... అడుక్కు తినడం నాకు బాధ అనిపించలేదు. నేను దాన్ని తిరస్కరించిన క్షణం నుంచి నాలో బాధ మొదలైంది. మీరు చూపించిన వాత్సల్యం నన్ను రాత్రిళ్లు నిద్ర పోనీకుండా చేస్తూ పోగా, క్రమంలో నాలో అపరాధభావన బలపడి అడుక్కు తినడం పట్ల అసహ్యం పెరిగింది. క్రమంగా అడుక్కు తినడం మానేశాను. వాళ్లూ వీళ్లూ స్వతహాగా పెట్టే తిండితో రోజులు నెట్టుక రాసాగాను."

నాలుగు డబ్బులియ్యగలిగితే ఇయ్యండి?! లేకపోతే లేదు. మీకో నమస్కారం... మీదారమ్మట మీరెల్లండి...' అంది.

ఆ పిల్ల మాటల్లో వెటకారానికి తిరస్కారానికి అవాక్కయిన మా ఆవిడ కాసేపు స్థాణువులా చేష్టలుడిగి నిలబడి పోయింది. నాకు నోటమ్మట మాట పెగల్లేదు. ఆ పిల్ల ఇదేమీ పట్టించుకోకుండా మెట్లమీద అడుక్కునే పనిలో బిజీ అయిపోయింది.

కాసేపటికి తేరుకొని మా ఆవిడ మొహం చిన్నబుచ్చుకొని షాపింగ్ ప్రసక్తి మానుకొని... నేను తనతో వస్తున్నదీ లేనిదీ గమనించకుండా విసవిసా నడిచి తిరిగి ఫ్లాట్‌కేసి వెళ్లసాగింది. యాంత్రికంగా తన్ననుసరించి వెళుతున్న నాలో ఆలోచనలు కదలాడసాగాయి. 'అరె మంచి చీరా జాకెట్టు అప్పనంగా వస్తుంటే ఎలాంటి భిక్షగాళ్లయినా కిమ్మనకుండా పుచ్చేసుకొంటారు! ఇష్టమైతే కట్టుకోవచ్చు... లేదా తనకిష్టమైన వాళ్లకు ఇచ్చే వీలూ ఉంది. కనీసం గోవిందరాజస్వామి గుడికి ఎగువన సందులో పాతగుడ్డలమ్మే వాళ్లకు తేరగా అమ్మేసి బిరియానీలు తినొచ్చు... ఇంతకూ ఆ అమ్మాయి చీర వద్దన్న కారణం ఎంతకూ అంతుబట్టడం లేదు' ఆలోచనల్నుంచి బయటపడేసరికి మా ఫ్లాటుకి చేరువయ్యాం.

ఆ సంఘటనతో ఎంతో చిన్నబుచ్చుకొన్న మా ఆవిడని అనునయించి మామూలు స్థితికి తీసుకురావడానికి నా తల ప్రాణం తోకకొచ్చేసింది.

★ ★ ★

మూడు మాసాల తర్వాత... మార్నింగ్ వాక్ చేస్తూ ఆరోజు యూనివర్శిటీ క్యాంపస్‌లోకి అడుగు పెట్టాం.

అంతటా పరచుకొన్న పచ్చదనం. చల్లని గాలులకు ఊగుతున్న యూకలిప్టస్ చెట్లు. చెట్ల గుబురు చిగురుల్లోంచి రాగాలు తీసే కోయిలలు. విరబూసిన పూలు... కిల కిలలు పోయే పక్షులు... మంచుకు తడిసి... గాలికి ఆరుతూ కడిగి ఆరేసినట్టనిపించే రోడ్లు... ఎత్తైన భవంతులతో యూనివర్శిటీ ఏరియా ఎంతో కళకళలాడుతూ ఉంది.

ఆరోజు వేకువఝాము నుంచే ప్రకృతి పరవశించినట్లు మనస్సుకు ప్రశాంతతను, ఆహ్లాదాన్ని కల్గిస్తోంది. అందుకే ఉదయం యూనివర్శిటీ రోడ్ల మీద జనం గుంపులు గుంపులుగా వ్యాయామం, వాకింగ్ చేస్తూ కనిపిస్తున్నారు. రోజూ వాకింగ్ చేస్తూ ఒక్కోసారి ఆ ప్రాంతానికి పోవడం మా దంపతులకు బాగా అలవాటై పోయింది.

యూనివర్శిటీ లైబ్రరీ దగ్గరగా వాక్ చేస్తూ వెళు తున్నాం. ఎదురుగా కాస్తంత దూరంలో పాతబడిన సైకిల్ స్టాండు కనిపిస్తోంది. అది పొడవుగా వున్న రేకుల షెడ్డు. అక్కడ భవన నిర్మాణ కార్మికులు కొందరు కాపురాలు పెట్టినట్టుగా ఉంది. వాళ్ల పెట్టెలు, పిల్లలు, పెంచుకొంటున్న కోళ్లు, కుక్కలు... వింతగా అనిపించి అటుకేసి చూస్తున్న మాకు చాలా ఆశ్చర్యం వేసింది. కారణం అక్కడ చీర వద్దన్న వీరవనిత అదే అడుక్కొనే అమ్మాయి కనిపించింది!

వాకింగ్ చేస్తూ వెళుతున్న మమ్మల్ని చూస్తూనే గుర్తుపట్టి మావేపు రాసాగింది. ఆ అమ్మాయి మొహం దూరం నుంచీ చూసీ చూడగానే పట్టరాని కోపంతో ఆ అమ్మాయిని చెడామడా తిట్టాలనిపించింది. మా ఆవిడ ఏదో గొణుగుతున్నా, ఏమాత్రం చలించకుండా వేగంగా వచ్చి చటుక్కున వంగి నా శ్రీమతి పాదాలను తాకి నమస్కరించబోయింది... దానికి చీదరించుకొంటూ మా ఆవిడ తనకు కాస్త ఎడంగా జరిగింది. దానికి ఆ అమ్మాయి కాస్త బాధపడినట్లు కనిపించినా... సంభాళించుకొని లేచి ముకుళిత హస్తాలతో

మా ముందు నిలబడింది. మా ఆవిడ మొహం కోపంతో జేవురించింది. కానీ ఆ అమ్మాయి వాలకంతో కాస్త మెత్తబడుతున్నట్లనిపించింది.

ఈలోపు ఆ అమ్మాయిని పరీక్షగా చూశాను. దాదాపు వయసు ఇరవై లోపే ఉంటుంది. కనిపించడానికి ఇంకాస్త చిన్న వయసుగానే అనిపిస్తుంది. నల్లగా, పుష్టిగా, నున్నగా ఉంది. మొహం, బుగ్గలూ పరువపు పూర్ణత్వాన్ని ఎరుకపరుస్తూ ఉన్నాయి. అంతకు మునుపే స్నానం చేసినట్టుంది కాబోలు. ఫ్రెష్‌గా అనిపిస్తోంది. వాయిల్ చీర, పూల జాకెట్టు, ఇమిటేషన్ దుద్దులు, రబ్బరు గాజులు వేసుకొని జుట్టు సన్నగా దువ్వుకొని వదులుగా జడ వేసుకొని మొహానికి పౌడరు, కళ్లకు కాటుక, నుదుట కుంకుమ ఎంతో ఆకర్షణీయంగా ఉంది.

'అడుక్కొని అడుక్కొని మసిబారిన నాటి మనిషికీ రంగుదేలి నాజూగ్గా కనిపిస్తున్న నేటి ఈ అమ్మాయికీ... ఇంతలో ఎంత తేడా!!' ఇలా నాలో నేను తన చుట్టూ అల్లుకుంటున్న ఆలోచనల మధ్య ఉండగానే ఆ అమ్మాయి మాతో ఇలా అంది.

'అమ్మా! అయ్యా! జాలి గుండె గల మీలాంటి పెద్దల దీవెనెలు మాలాంటి వారికి కోటి వరాలు. స్టేషను దగ్గర అడుక్కొంటుండగా నన్ను చూశారు. జాలిపడి నాపై వాత్సల్యంతో చీర, రవిక ఇవ్వజూపారు. నేను తీసుకోనందుకు చిన్నబుచ్చుకున్నారు. నేను ఆ రకంగా పెద్ద తప్పు చేశాను. మన్నించండి'.

ఈలోగా మెత్తబడ్డ మా ఆవిడ 'తమరి తప్పును మేమెందుకు క్షమించాలో... సెలవిస్తే బాగుంటుంది?!' వెటకారంగా అంది.

దానికి ఆ అమ్మాయి 'అమ్మా నేను అడుక్కొనే స్థితికి ఎందుకు వచ్చానో మనవి చేసుకోవాలి. మాదీ ఒకప్పుడు కాస్త జరుగుబాటుగల కుటుంబమే... కానీ మా సీమలో వర్షాలు రాక పంటలు పండక కుటుంబం క్రమంగా చితికిపోసాగింది. నేను పది దాక చదువుకొన్నాను. నాకు పెళ్లి చేసి మావాళ్లు బరువు దించేసుకున్నారు. సంవత్సరాల తరబడి వానలు కురవక కరువొచ్చింది. కన్నతల్లి ఒడిలాంటి మా పొలాలు బీళ్లు పడి, బీటలు వారాయి. తల్లిలా పాలిచ్చి పోషించిన గోమాతలు గోడుమంటూ కబేళాలకు తరలించబడ్డాయి. ఎండలకు తాళలేని గుడిసెలు మంటలకు మండి మసైనాయి. బతుకులు ఛిద్రమై చింకిపాతల్లో పొట్ట చేతబట్టుకొని దొంగలబండి ఎక్కి కదిరినించీ తిరుపతి చేరినాము.

వచ్చిన కొత్తల్లో, వంట్లో కాస్త శక్తి కూడదీసుకొని పరువైన పని కోసం ప్రయత్నించాము. ఎక్కడా పని దొరకలేదు. దొరికినా బొటాబొటీగా తిండికే సరిపోయేది కాదు. ఆఫీసులో పనులు లేక కాదు, కావాల్సినన్ని పనులున్నాయి... కానీ ఆ పనుల్లోకి కుదరాలంటే... ఆశగా నా వంటివేపు చూస్తున్న కళ్లతో బేరాలు కుదరాలి. అది నాకిష్టం లేదు. ఇష్టమున్నా లేకున్నా ఆకలికి అన్నం కావాలి. లంజరికం, దొంగతనం తప్పుగానీ, అడుక్కోవడం తప్పనలేదు. అందుకే అడుక్కోవడం మొదలెట్టాను' చెప్పుకుపోతూ కాస్త ఆగి ఊపిరి తీసుకొంది.

'కాని మీరు నాకు చీర ఇవ్వజూపిన రోజు దాకా... అడుక్కు తినడం నాకు బాధ అనిపించలేదు. నేను దాన్ని తిరస్కరించిన క్షణం నుంచి నాలో బాధ మొదలైంది. మీరు చూపించిన వాత్సల్యం నన్ను రాత్రిళ్లు నిద్ర పోనీకుండా చేస్తూ పోగా, క్రమంలో నాలో అపరాధభావన బలపడి అడుక్కు తినడం పట్ల అసహ్యం పెరిగింది. క్రమంగా అడుక్కు తినడం మానేశాను. వాళ్లూ వీళ్లూ స్వతహాగా పెట్టే తిండితో రోజులు నెట్టుక రాసాగాను. ఇంతలో మా దూరపు బంధువు రామయ్య బాబాయి నన్ను చూసి, నా స్థితికి జాలిపడి మా ఇంటాయన్ని, నన్ను ఇక్కడకు తీసుకువచ్చి 'మీరు వళ్లు అమ్ముకోవద్దు, వొళ్లొంచి కష్టపడండి, పరువుగా బ్రతకండి' అని మా ఆయనకి మేస్త్రీగా పని ఇప్పించాడు. ఇక్కడ రోజూ పనులు చేసుకొంటూ పరువుగా జీవిస్తున్నాము. మీరు ఆరోజు ఇచ్చిన చీర తీసుకొని కట్టుకొని అడుక్కుంటే చిల్లర డబ్బులేమి ఖర్మ... వందలు వేలు కురిసేవి. మానం ప్రాణం కన్నా ఎక్కువగా భావించే నేను ఆరోజు అందుకే చీర వద్దన్నాను. మన్నించండి. ఇప్పుడు ఏ మాసిన చీర అయినా ఇవ్వండి చాలు. పుట్టింటి పట్టుచీరలా కట్టుకొని, కనిపించి మీ దీవెనలు అందుకొంటాను' అంది.

తను మాట్లాడుతూ వుంటే కళ్లలో సన్నని నీటి తెరలు.. ఆ తెరల మాటున వణికే స్వరం నుంచి బాధ బయటపడుతుంటే, తను చెప్పేవి వింటూ మేమూ అచేతనంగా అలాగే నిలబడి పోయాం. తను చెప్పేది వింటుండగానే తనమీద మాకు కలిగిన కోపం మంచులా కరిగిపోయింది.

అంతా విని తన్ని దగ్గరకు పిలిచి మా ఆవిడ ఆ అమ్మాయి తల నిమురుతూ దీవించింది. నేను ప్రసన్నంగా చూస్తూ కళ్లతోనే దీవించాను. దాంతో కళ్లనిండా ఆనందం నింపుకొని ఆ అమ్మాయి వెనుదిరిగింది. ఆత్మీయ కడలి తరంగం చెలియలికట్టను స్పృశించిన చందాన మనస్సు వికలమై గుండె గొంతుకలో కొచ్చింది.

✡

రచనలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం 'స్నేహ' మీ రచనలకు ఆహ్వానం పలుకుతోంది. కథకులే కాదు! రచనల పట్ల ఆసక్తి వున్న, శక్తి వున్న వారెవరైనా మీ కలాలను కదిలించి రకరకాల అంశాలను పంపవచ్చు. మీ సమీప ప్రాంతాలలో నెలకొన్న దర్శనీయ స్థలాలు, మీరు చూసొచ్చిన పర్యాటక ప్రదేశాల గురించి రాయవచ్చు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో రికార్డులు సృష్టించిన, అవార్డులు పొందిన కళాకారులు, క్రీడాకారులు, చిత్రకారులు, సినీరంగానికి చెందినవారి గురించి రాసి పంపవచ్చు. మట్టిలో మాణిక్యాల్లా స్వశక్తితో విజయాలు సాధించినవారి గురించీ పంపవచ్చు. ఒకవేళ అవేవీ రాయలేకపోయినా సలహాలు, సూచనలు ఇచ్చినా సంతోషమే. వారికీ ఆహ్వానం. స్నేహ పత్రికలో ఇప్పుడు వస్తున్న అంశాలు కాకుండా ఇంకా సమయానుకూలంగా ఇదిగో ఇవి వస్తే బాగుంటాయి. అని మీకనిపిస్తే మాకు తెలియచేయండి. రచన స్థాయిని బట్టి పారితోషికం వుంటుంది.

-ఎడిటర్

రచనలను పంపాల్సిన చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1,
ఆజమాబాద్,
హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్:
snehaweekly.praja@gmail.com

నవ్వుల్ – పువ్వుల్

కొనివ్వండి



మేనేజర్ : ఆఫీసుకు ఇంత లేటుగా వస్తున్నావేం...?

ఉద్యోగి : టైమ్‌కి వద్దామనుకుంటున్నా గాని వాచీ సరిగ్గా పని చేయడం లేదు... ఓ మంచి వాచీ కొనివ్వండి!

లోన్



తరుణ్ : నాకు నీవు ఇంత సాయం చేశావ్, నీ రుణం ఎలా తీర్చుకోవాలో అర్థం కావట్లేదురా..!

చరణ్ : బ్యాంక్ లోన్ పెట్టి తీర్చుకో...!

ఎగనామం

హోటల్ యజమాని : ఎందుకయ్యా అలా కస్టమర్స్ మీద కేకలు వేస్తున్నావు...?

సర్వర్ : వాళ్లిద్దరూ టిఫిన్ తిని 'బిల్లు నే కడతా అంటే నే కడతా' అని వాదించుకుని, ఎవరూ కట్టకుండా వెళ్లిపోతున్నారు సార్..!

కడుక్కొని...



కస్టమర్ : కె.జి చింతపండు కావాలండీ...!

షాపు యజమాని : అలాగే...!

కస్టమర్ : ఆగండాగండి.. మీ దగ్గర లైఫ్‌బాయ్ సబ్బు వుంటే దాంతో చేతులు కడుక్కుని ఇవ్వండి..!

ఫీజు

డాక్టర్ : మీరు ఖచ్చితంగా రెండు నెలల్లో నడవగలుగుతారు...!

పేషెంట్ : అంటే రెండు నెలల్లో మీ ఫీజు కట్టలేక నా బైక్ అమ్మేస్తానంటారా...!

కలిసొస్తాయని



భార్య : ఏవండీ నిన్న మీరు... మీ లేడీ గుమస్తాతో కలసి సినిమాకి వెళ్లారట కదా...!

భర్త : అవునే... టికెట్ ఆవిడ తీస్తానంటేనూ... మనకు డబ్బులు కలిసొస్తాయని వెళ్లాన్లే...!

ఈజిప్టులో..

పరంధామయ్య : బాబూ, మీ ఇంట్లో మమ్మీ వుందా...?

చింటూ : మమ్మీలు ఈజిప్ట్‌లో వుంటాయి కదండీ, మా ఇంట్లో ఎందుకు వుంటాయి.

మునగ చెట్టు



రమ్య : మీ పిల్లలు ఎప్పుడూ లేనంతగా విపరీతంగా ఆటలు ఆడేస్తున్నారొదినా...!

దివ్య : దానికి నా దగ్గరకు వచ్చి చెప్పడమెందుకు? ఆటలాడితే మంచిదేగా..!

రమ్య : వారు ఆడేది మునగ చెట్టు మీద.

సిగ్గుందా?



రాధ: నీకసలు సిగ్గుందా..?

సుధ : అదే వుంటే ఇంతసేపు నీతో ఎందుకు మాట్లాడతాను?

నిరూపిస్తే...

అమ్మాయి తండ్రి : కంఠంలో ప్రాణం వుండగా నా కూతురిని నీకిచ్చి పెళ్లి చేయను...!

చరణ్ : మీ ప్రాణం కంఠంలో కాకుండా, మీ గుండెల్లో వుంటుందని నిరూపిస్తే పెళ్లి చేస్తారా...!

- ముత్యాల శ్రీశరత్‌బాబు,

ఫోన్ నెం : 9963298921

◆ స్ఫూర్తి

పిల్లలు కాదు! పిడుగులు!!



మలాలా! ఆడపిల్లల చదువుకోసం, విద్యా హక్కు కోసం బుల్లెట్లకు సైతం వెరవని సాహసి. నోబెల్ శాంతి బహుమతి అందుకోనున్న అతి పిన్న వయస్కురాలు. అలాంటి మలాలా సరసన చోటు సంపాదించింది మన దేశానికి చెందిన రేఖా కాళింది. ఈమె మాత్రం తక్కువదా! బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీర. ఇలా... బాలల హక్కులకోసం పోరాడిన ఇరవై మంది చిన్నారుల స్ఫూర్తిదాయక గాథలు ఒకే చోట చదువుకోవడానికి వీలుగా వుంటే ఎలా వుంటుంది? ఆ పనిని యునిసెఫ్ చేపట్టింది. ఈ నెల 20వ తేదీనాటికి ఐక్యరాజ్య సమితి బాలల హక్కుల ప్రకటన జరిగి పాతికేళ్లవుతోంది. ఈ సందర్భంగా యునిసెఫ్ 'చిల్డ్రన్ హు చేంజ్డ్ ది వరల్డ్' అనే పుస్తకాన్ని తీసుకొస్తోంది. ఇందులో... మలాలా(పాకిస్తాన్), రేఖా కాళింది (ఇండియా), నుజూద్ అలీ (ఎమెన్), అన్నే ఫ్రాంక్ , ఇక్బాల్ మాశి (పాకిస్తాన్), కోశి జాన్సన్ (దక్షిణాఫ్రికా), ఊర్మిళ చౌదరి (నేపాల్), కిమ్ ఫుక్ (వియత్నాం)... చేసిన పోరాటం వుంది. తోటి వారి కోసం పడ్డ ఆరాటం వుంది. వీరిలోంచి నల్గురు చిన్నారుల స్ఫూర్తిదాయక జీవితం రేఖామాత్రంగా....

పదేళ్లకే విడాకులు

నుజూద్ అలీ, ఎమెన్

పదేళ్లంటే ఆటపాటల వయసు. ఆరేళ్ల కిందట ... నుజూద్ అలీ వయసు కూడా అంతే. కానీ ఆమెకు పెళ్లయింది. అదీ ముప్పయ్యేళ్ల వాడితో. తనే కాదు. ఎమెన్ దేశంలో ఆ వయసు పిల్లలందరూ అంతే. వారికి బాల్యంలోనే వివాహాలు చేసేస్తారు. పెళ్లయిన మరు క్షణంలోనే నుజూద్ బాల్యాన్ని కోల్పోయింది. తనకు ఇష్టంలేని మోయలేని బరువు బాధ్యతలు వచ్చి మీద పడ్డాయి. వివాహ బంధంలో చిక్కుకున్న తొలినాటి నుంచే భర్త నుంచి లైంగిక వేధింపులు మొదలయ్యాయి. తన 'మాట' వినకపోతే అతను చిన్నారిని కొట్టేవాడు. భరించలేక తనను విడిచిపెట్టమని తల్లిదండ్రుల దగ్గరకు పోనిమ్మని వారి కాళ్లా వేళ్లా పడింది. అయినా ఆ రాతిమనసులు కరిగేవి కావు. అలా రెండు నెలలపాటు ఆ నరకంలో నే గడిపింది. తర్వాత ఓరోజు ఇంటి నుంచి తప్పించుకుని ట్యాక్సీలో సానాలోని న్యాయస్థానం చేరుకుంది. అనేక గంటల పాటు వేచి వున్నాక న్యాయమూర్తికి తన గోడు వినిపించుకునే అవకాశం వచ్చింది. ఆయన నుజూద్ కన్నీటి మయ గాథ విని కరిగిపోయి మానవహక్కుల కార్యకర్త కూడా అయిన లాయర్ షాదా నజీర్‌కు కేసు అప్పగించారు. ఆమే నుజూద్‌కు విడాకులు ఇప్పించింది. ఆ దేశంలో విడాకులు అడిగిన, పుచ్చుకున్న మొట్టమొదటి చిన్నారి పెళ్లికూతురు నుజూద్ అలీ. ఆమె కథనం ప్రపంచంలోని అన్ని ప్రముఖ పత్రికలన్నిట్లోను అచ్చయింది. వివాహం అయిన దగ్గర్నుంచి విడాకులు పొందే వరకు నుజూద్ చూపిన తెగువకు, కనబరచిన ధైర్యానికి, చేసిన పోరాటానికి ఎన్నో గుర్తింపులు, అవార్డులు వరించాయి. అన్నిటిని మించి ఎమెన్‌లోని బాల్యవివాహాల దురాచారం మీద చర్చ జరగడానికి, అందులోంచి బైటపడడానికి కూడా నుజూద్ ఇచ్చిన, ఇస్తున్న స్ఫూర్తి అంతా ఇంతా కాదు.

దురాచారాలపై అలుపెరగని పోరు

రేఖా కాళింది, పశ్చిమ బెంగాల్

రేఖ కాళింది పదవ తరగతి చదువుతోంది. పశ్చిమబెంగాల్ పురూలియాలోని ఓ కుగ్రామం ఆమెది. అక్కడ ఆడపిల్ల పుడితే దుశ్శకునంగా, అశుభంగా భావిస్తారు నేటికీ. అదో దుర్వార్త వారికి. అందుకే బాల్య వివాహాలు చేసేసి ఆడపిల్లను వదిలించుకుంటుంటారు. అయితే రేఖ అటువంటి పురాతన దురాచారాలను వ్యతిరేకంచడంలో ముందు నిలబడింది. పదకొండేళ్ల వయసులో పెళ్లి చేసి రేఖ బరువు దించుకోవాలని నిశ్చయించారు తల్లిదండ్రులు. పన్నెండేళ్ల వయసులో ఓ బిడ్డకు తల్లై తన అక్క పడుతున్న కష్టాలను కళ్లారా చూసిన రేఖ ... పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలనుకోలేదు. అందుకోసం ఎంతకైనా తెగించాలనుకుంది. పోరాడాలనుకుంది. అంతేతప్ప ఆ విష వలయంలో బంధీ కాదలచుకోలేదు. ఓరోజు తమ పాఠశాలకు వచ్చిన రాష్ట్ర కార్మిక శాఖా మంత్రికి తన వివాహ ప్రతిపాదనను, అందుకు తన వ్యతిరేకతను ధైర్యంగా అందరి ముందు తెలియచేసింది. ఈ కథనం పత్రికల్లో సవివరంగా ప్రముఖంగా ప్రచురణైంది. దాంతో తల్లి ఆమెను విపరీతంగా కొట్టి స్కూలుకు వెళ్లనవసరం లేదని చెప్పేసింది. తిండి కూడా లేదు. మంత్రిగారి కార్యాలయం నుంచి ఒత్తిడి అనంతరం పాఠశాలకు తిరిగి వెళ్లే అవకాశం కలిగిందామెకు. తన హక్కుల గురించి పాఠశాలలోనే నేర్చుకుంది మరి. బాల్య వివాహాలు ఎంత బాధాకరమైనవో, అనాగకరికమైనవో పాఠాల ద్వారానే కాదు. నిజ జీవితంలోనూ తెల్సుకుంది. అందుకే ఆ బంధనంలో ఇరుక్కోకుండా వుండేందుకు పెద్ద పోరాటమే చేసింది. ఆమెను చూసి మరో ఇద్దరు స్నేహితురాళ్లు కూడా పెద్దలు తలపెట్టిన బాల్యవివాహాలకు అడ్డం తిరిగారు. ఈ విషయంలో వీరు చూపిన తెగువకు జాతీయ సాహస బాలల అవార్డు సైతం అందుకున్నారు. ఎందరికో స్ఫూర్తిదాతలుగా నిలిచారు.

బాల కార్మికుల విముక్తికై పోరాటం

ఇక్బాల్ మాసి, పాకిస్తాన్



పసి వయసులోనే ...బానిసత్వంలో మగ్గుతున్న చిన్నారుల స్వేచ్ఛకై పోరాడిన పిడుగు ఇక్బాల్ మాసి. పాకిస్తాన్ రాజధాని సమీపానున్న మురిడ్కే అనే కుగ్రామంలో పుట్టాడు. పేదరికానికి తోడు తండ్రి తన చిన్నతనంలోనే ఇంటి నుంచి వెళ్లిపోవడంతో నిష్ఠ దరిద్రం తాండవిస్తుండేది. అప్పటికే వున్న అప్పులకు తోడు పెద్దన్న పెళ్లికి మళ్లీ చెయ్యి చాచాల్సి వచ్చింది. ఇక్బాల్ పేరు మీద ఆరు వందల రూపాయలు అప్పు చేసింది అతని తల్లి. అప్పు ఇచ్చినతనికి తివాచీ తయారీ వ్యాపారం వుండేది. రెండేళ్లు గడిచిపోయినా ఆ డబ్బు తిరిగి ఇవ్వలేకపోయారు. దాంతో అప్పు కింద నాలుగేళ్ల చిన్నారి ఇక్బాల్ తివాచీ తయారీ పనిలో కుదిరాడు. ఆ పసివయసులో వారానికి ఏడు రోజులు, రోజుకు పద్నాలుగు గంటలపాటు పని చేసినా... అతనికి అందింది దెబ్బలు...తిట్లు... తెలిసీ తెలియక చేసిన తప్పులకు శిక్షగా అప్పు మీద వడ్డీ పెరగడం మినహా మరేమీ వుండేది కాదు. కాకపోతే తిండి పెట్టేవారంతే. పాకిస్తాన్‌లో బాల కార్మికులకు, బానిస కార్మికులు, వెట్టి కార్మికులపై నిషేధం వుంది. అలా పని చేయించుకోవడం చట్ట వ్యతిరేకం. అయినప్పటికీ పలు రకాల సంస్థల యజమానులు పోలీసులకు ఆమ్యామ్యాలు సమర్పిస్తూ... చిన్నారులతో నిరాటంకంగా వెట్టి చేయించుకునేవారు. తనకు పదేళ్ల వయసు వచ్చే వరకు అపరిశుభ్ర, అనారోగ్యకర వాతావరణంలో పనిచేయడం, పౌష్టికాహారం లోపం, తగినంత వ్యాయామం లేకపోవడం వల్ల...ఇక్బాల్ బలహీనంగా వుండేవాడు. అలాంటి బక్కపల్చటి పిల్లాడు మరికొంతమందిని పోగుచేసి తమ మూలుగలు పీల్చేస్తున్న యజమాని నుంచి దూరంగా పారిపోవాలని చూశాడు. అక్కడి నుంచి రహస్యంగా బైటపడి సీదా పోలీస్ స్టేషన్‌కెళ్లి యజమాని తమను ఏవిధంగా కొడుతోందీ, తిడుతోందీ కళ్లకు కట్టినట్టు చెప్పాడు. దానికి వారు పిల్లాణ్ణి కాపాడాల్సింది పోయి... వారందరినీ తిరిగి యజమానికి అప్పగించారు. మరి యజమానికి, పోలీసులకు వున్న లావాదేవీలు అలాంటివి. పారిపోవడానికి ప్రయత్నించినందుకు శిక్షగా... గొలుసులతో కట్టేసి.. తలకిందులుగా వేళ్లాడదీసి పస్తులుంచారు ఇక్బాల్ బృందాన్ని. ఈ ఇనుప బంధనాలేవీ ఇక్బాల్‌ని ఆపలేకపోయాయి. రెండోసారీ తప్పించుకున్నాడు. ఈసారి బాండెడ్ లేబర్ లిబరేషన్ ఫౌండేషన్ (బిఎల్ఎల్ఎఫ్) నిర్వహించే పాఠశాలలో చేరి నాలుగేళ్ల చదువును రెండేళ్లకే పూర్తిచేశాడు. పైగా కార్మిక హక్కుల గురించి తెలుసుకున్నాడు. రుణ బానిసత్వం చట్టవ్యతిరేకమైనదని, ఆవిధమైన అప్పులను ప్రభుత్వం రద్దు చేసిందని కూడా తెలుసుకున్నాడు. ఇక్బాల్‌లో వున్న వాక్పటిమ, ప్రశ్నించే తత్వం, మాటకారితనం ... బిఎల్ఎల్ఎఫ్ నాయకులను ఆకట్టుకున్నాయి. తమ సంస్థ నిర్వహించే సమావేశాలు, ర్యాలీల్లో ఇక్బాల్ ప్రసంగం తప్పక వుండేలా చూసేవారు. ఉత్తేజకరమైన ప్రసంగాలు ఇవ్వడంలో, తనకు అర్థమైన కార్మికచట్టాల గురించి వివరించడంలో...వెట్టి నుంచి, బానిసత్వం నుంచి బైటపడడంలో శక్తిమేరకు కృషి చేసేవాడా చిన్నారి. ఒక్క పాకిస్తాన్‌లో కాదు. ప్రపంచవ్యాప్తంగా వెట్టిలో మగ్గుతున్న పిల్లల స్వేచ్ఛకై ఉద్యమించాడు. 'పిల్లల చేతుల్లో కలాలుండాలి. పనిముట్లు కాదు. అబ్రహం లింకన్‌లా పాకిస్తాన్‌లో నేను పనిచేస్తాను...' అనేవాడు ఇక్బాల్. అలాంటి చిన్నారి 1995లో తన నేస్తాలతో కలిసి సైకిల్ మీద వస్తుండగా పాకిస్తాన్‌లోని కార్పెట్ మాఫియా ముఠా కాల్పులు జరిపి ఇక్బాల్ ప్రాణాలు బలి తీసుకుంది.

ఇక్బాల్ స్ఫూర్తితో 'ఫ్రీ ది చిల్డ్రన్' అనే సంస్థ ఏర్పడింది. ఇది వెట్టిచాకిరిలో కునారిల్లే బాలల స్వేచ్ఛకై పనిచేస్తోంది. పాకిస్తాన్‌లో ఇక్బాల్ పేరిట ఇరవై స్కూళ్లు ఏర్పాటయ్యాయి.

ఎయిడ్స్ బాధితుల సాయం కోసం...

కోశి జాన్‌సన్, దక్షిణాఫ్రికా



డన్‌హసర్! దక్షిణాఫ్రికాలోని ఓ చిన్ని గ్రామం. అక్కడ... ఎయిడ్స్ రక్కసి కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్న తల్లిదండ్రులకు జన్మించాడు కోశి జాన్‌సన్. నిజానికా దేశంలో ఇలాంటి పిల్లలెందరో! అయితే తన గురించి మొదటిసారిగా ప్రపంచానికి తెల్సింది మాత్రం 1997వ సంవత్సరంలో. కోశి జాన్‌సన్‌ను ప్రీస్కూల్‌లో చేర్చుకునేందుకు జోహాన్స్‌బర్గ్‌లోని ఓ స్కూలు తిరస్కరించడం పెద్ద వార్త అయ్యింది. కారణం ఆ చిన్నారి హెచ్‌ఐవి పాజిటివ్ కావడమే. రాజకీయంగా కూడా పెద్ద చర్చనీయాంశమై... నిబంధనలను సవరించుకుని మరీ ఆ స్కూలు కోశిని ఆహ్వానించాల్సి వచ్చింది. అయితే స్కూల్లో చేరిన సంవత్సరమే ఎయిడ్స్ కారణంగా తల్లి చనిపోవడంతో... అనాథ అయ్యాడు. అప్పుడు గెయిల్ జాన్సన్ కోశిని దత్తతు తీసుకుని పెంచింది. వైద్య చికిత్స, ఆరోగ్యకర వాతావరణం, మంచి ఆహారం తీసుకోవడం వల్ల స్కూల్లోను, ఇంటి దగ్గర చురుగ్గా వుండేవాడు. 13వ ఇంటర్నేషనల్ ఎయిడ్స్ కాన్ఫరెన్స్ సందర్భంగా మాట్లాడే అవకాశం కోశికి లభించింది. హెచ్‌ఐవి, ఎయిడ్స్ వున్న వారు ధైర్యంగా చెప్పుకోవాలని, చికిత్స పొందాలని చెప్పాడు తన ప్రసంగంలో. ఇలా సాగాయి తన మాటలు "మన గురించి మనం జాగ్రత్త తీసుకోవాలి. మనమూ మనుషులమే. మనకూ కాళ్లు చేతులు వున్నాయి. మనం మాట్లాడగలం. నడవగలం. అందరిలాగే మనకూ అవసరాలున్నాయి. భయపడకండి. మనందరం ఒకటే...'. పసివాడైతేనేం! భయంకరమైన రక్కసి బారిన పడి తమలో తాము కుంగిపోకుండా మామూలు జీవితం గడపాలని ... వయసుకు తగ్గ మాటలతో... ఎంత బాగా చెప్పాడు. మాటలకే పరిమితం కాలేదా చిన్నారి. తన పెంపుడు తల్లి మద్దతుతో ఎయిడ్స్ బాధిత తల్లులకు, పిల్లలకు బాసటనిచ్చే ఆశ్రమాన్ని ఏర్పాటు చేశాడు. ఎయిడ్స్‌తో ఎలా బతకాలో, తోటి వారి నుంచి వచ్చే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో, అన్నిటిని తట్టుకుని ధైర్యంగా ఎలా జీవించాలో చెప్తుండేవాడు. పన్నెండేళ్ల వయసులో హెచ్‌ఐవి ఆ చిన్నారిని పొట్టన పెట్టుకుంది. తన ఆఖరి శ్వాస వరకు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల హక్కులకోసం పోరాడిన కోశికి... మరణానంతరం (2005) ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ సంస్థ శాంతి బహుమతిని ప్రకటించింది.

పిల్లలా వీళ్లు!? తమ మాటలతో, పోరాటాలతో సదరు...సమస్యల పరిష్కారాలకై కృషి చేసిన పిడుగులు!

- కె. చరిత

ప్రాణదాతలు

friends2support.org

నలుగురు మిత్రులు

'యువతరం శిరమెత్తితే... నవతరం గళమిప్పితే లోకమే మారిపోదా ...' అన్నారు ఒక రచయిత. అక్షరాల అదే స్ఫూర్తి కాకపోయినా, సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలన్న ఆలోచనలోంచి పుట్టిందే ఫ్రెండ్స్ టు సపోర్ట్.ఓఆర్‌జి వెబ్‌సైట్. తొమ్మిది సంవత్సరాల క్రితం గుంటూరు జిల్లాలో నవంబర్ 14న పురుడు పోసుకున్న ఈ సంస్థ రక్తదాన రంగంలో భారతదేశంలో ఇప్పుడు సరికొత్త చరిత్రను సృష్టిస్తోంది.

■ **వి. రాజగోపాల్**

నలుగురంటే నలుగురు యువకులతో ప్రారంభమైన ఈ సంస్థలో ప్రస్తుతం 1.50 లక్షల మందికిపైగా సభ్యులతో భారతదేశంలో అతిపెద్ద, నమ్మకమైన రక్తదాన సంస్థగా ఎదిగింది. ప్రతి రోజు దేశవ్యాప్తంగా వందలాది మంది ఆపన్నులకూ ఈ సంస్థ సభ్యులు రక్తదానం చేస్తున్నారు. భారతదేశపు అతి పెద్ద స్వచ్ఛంద రక్తదాతల వెబ్‌సైట్‌గా వరుసగా ఐదు సంవత్సరాలు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఈ సంస్థ ఎక్కింది. అసిస్ట్, ఆసియా రికార్డుల పుస్తకాలూ ఈ సంస్థను నమోదుచేశాయి. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యునిసెఫ్ ఇచ్చే ప్రతిష్టాత్మక యువసమ్మేళన అవార్డులను రెండు సంవత్సరాలు 'ఫ్రెండ్స్‌టుసపోర్ట్' friends2support.org దక్కించుకుంది. శాస్త్ర సాంకేతిక రంగాలను సామాన్యుడి సేవకు వినియోగిస్తున్నందున ఈ అవార్డులు దక్కాయి. భారతదేశపు రాయబారిగా ఈ సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన షరీఫ్‌ను యునిసెఫ్ నియమించింది. మాన్‌థాన్, ఎం బిలియంత్ సౌత్ ఆసియా అవార్డులనూ దక్కించుకుంది.

ఈ ప్రయాణం అంత సులభంగా ఏమీ సాగలేదు. బాలారిష్టాల నుండి బెదిరింపులనూ ఎదుర్కోవాల్సి వచ్చింది. అనుమానాలకు సమాధానాలు ఇవ్వడంతో పాటు అవమానాలనూ భరించాల్సి వచ్చింది. అంతేకాదు! అగ్రరాజ్యపు అభిజాత్యాన్నీ చవిచూడాల్సి వచ్చింది! అంతర్జాతీయ గుర్తింపు దక్కినా... స్వదేశంలో మాత్రం ఇప్పటికీ ఆటుపోట్ల ప్రయాణాన్ని కొనసాగించాల్సి వస్తోంది. 'దేశంలో అందరికి సురక్షిత రక్తాన్ని అందుబాటులో ఉంచాలన్నదే మా లక్ష్యం. ఈ క్రమంలో రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించాలి. అన్ని రాష్ట్రాల్లోనూ మా సభ్యులు యువకులపై దృష్టి కేంద్రీకరించి ఈ ప్రచారాన్నే చేస్తున్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో పది లక్షల మంది రక్తదాతలను మా వెబ్‌సైట్‌లో నమోదు చేయించాలన్నది మా లక్ష్యం' అని షరీఫ్ చెబుతున్నారు. ఈ సంస్థ సాగిస్తున్న ప్రయాణంపై ప్రత్యేక కథనం ...

'ఫ్రెండ్స్ టు సపోర్ట్' 1.50 లక్షల మంది సభ్యత్వం... ప్రతిరోజూ దేశ వ్యాప్తంగా వందలాది మంది రక్తదానం... వివిధ సంస్థల ప్రతిష్టాత్మక పురస్కారాలు... ఆపద సమయంలో ఆధారపడదగిన సంస్థగా గుర్తింపు... ఇది ఈ రోజు పరిస్థితి. కాని కొన్ని సంవత్సరాల కిందట దీనికి భిన్నమైన పరిస్థితి వుంది. సరిగ్గా తొమ్మిదేళ్ల క్రితం 2005 నవంబర్ 14న ఫ్రెండ్స్ టు సపోర్ట్.ఓఆర్‌జి (friends2support.org) ఆవిర్భవించింది. ప్రారంభించిన రోజున ఈ సంస్థలో సభ్యులు నలుగురు స్నేహితులే. ప్రాణం మీదకు వచ్చినప్పుడు రక్తాన్ని సత్వరమే స్వచ్ఛందంగా అందుబాటులో ఉంచడం, ఆ క్రమంలో దళారులను నిరోధించడం వీరి లక్ష్యం. లక్ష్యం ఘనంగా ఉన్నప్పటికీ ఆరంభంలో అడుగడుగునా తడబాట్లే! ఎంచుకున్నది రక్తదాన రంగం కావడం, ఇంటర్నెట్ ఆధారిత వ్యవస్థ కావడంతో ఎన్నో అనుమానాలు, మరెన్నో ప్రశ్నలు. సంస్థలో సభ్యులుగా చేరాలన్న విజ్ఞప్తికి ప్రశ్నలే సమాధానంగా వచ్చేవి! 'చాలామందిని చూశాం... ఇప్పుడు మీరొచ్చారు...' వంటి వ్యాఖ్యలు ఎదురయ్యాయి. ఇంటర్నెట్‌పై అవగాహన ఉన్నవారే తక్కువ కదా... మీ వెబ్‌సైట్‌తో ప్రయోజనం ఎంత మందికి ఉంటుంది? వంటి ప్రశ్నలు ఎదురయ్యాయి. ఆపద ముంచుకొచ్చినప్పుడు ఇంటర్నెట్ సెంటర్‌కు వెళ్లే వాళ్లు ఎంతమంది ఉంటారు? అనే సందేహాలు వచ్చాయి. ఈ ప్రశ్నలకు,

సందేహాలను వారు ఓపికగా తీర్చేవారు. భవిష్యత్‌లో ఇంటర్నెట్ పాత్ర ఎలా పెరగనుందో వివరించేవారు. ఈ సందేహాలన్నీ తీర్చిన తరువాత చివరగా వచ్చే ప్రశ్న మీకేంటి ప్రయోజనం...? ఏ లాభమూ లేకుండా మీరెందుకు ఈ పని చేస్తున్నారని... దీనికి వీరిచ్చే 'సామాజిక బాధ్యత' అని. సంస్థను ప్రారంభించిన రోజునే దీని నిర్వహణ కోసం ఎవ్వరినుండి నిధులు సమీకరించకూడదని, తాము చేస్తున్న ఉద్యోగాల నుండి వచ్చే జీతాలనే వినియోగించాలని నిర్ణయం తీసుకున్నామని, ఇప్పటికీ దానినే అమలు చేస్తున్నామని షరీఫ్ చెబుతారు. ఈ ప్రశ్నల పరంపరను ఎదుర్కుంటూనే ప్రచార కార్యక్రమంపై ఫ్రెండ్స్‌టుసపోర్ట్ దృష్టి సారించింది. 'రక్తదానం చేయడం అందరి బాధ్యత. ఫ్రెండ్స్ టు సపోర్ట్‌లో నమోదు చేయించుకోవడం రక్తదాతల బాధ్యత' 'రక్తదానం చేయండి. ప్రాణదాతలు కండి...' అనే నినాదాలతో ప్రచారం ప్రారంభించారు. కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులే లక్ష్యంగా ప్రారంభమైన ఈ ప్రచారానికి సానుకూల స్పందన కనిపించింది. అప్పటి సమైక్య రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల్లో 5కె వాక్‌లు నిర్వహించడం, కళాశాలలకు వెళ్లి వెబ్‌సైట్ గురించి ప్రచారం చేయడం, డెమోలు ఇవ్వడం, రక్తదాన ఆవశ్యకతను వివరించడం, గ్రూపు సమావేశాలు నిర్వహించడం, కరపత్రాలు పంచడం వంటి చర్యలతో సభ్యులుగా నమోదు అయ్యే వారి సంఖ్య క్రమేణా పెరిగింది. ఈ క్రమంలోనే సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విటర్లను పూర్తిస్థాయిలో వినియోగించుకున్నారు. తమిళనాడులో రాష్ట్ర వ్యాప్తంగా యాత్రను నిర్వహించారు. ఫలితంగా కేవలం సభ్యులుగా నమోదు కావడమే కాకుండా వాలంటీర్లుగా పనిచేయడానికి వివిధ ప్రాంతాల నుండి యువకులు ముందుకు రావడంతో ఇతర ప్రాంతాలకు విస్తరించింది. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన సంగతి మరోకటి ఉంది. ఈ సంస్థ వ్యవస్థాపకులతో పాటు, వివిధ ప్రాంతాల్లో వాలంటీర్లుగా పనిచేస్తున్న వారు కూడా ఏదో ఒక వృత్తిలో బిజీగా ఉండే వారే! అయితే ఏం, ఒకరి నుండి మరొకరికి, వారి నుండి ఇంకొకరికి ఇలా ఫ్రెండ్స్ టు సపోర్ట్ విస్తరించింది. 2007లో మొదటి సారి 10వేల సభ్యుల సంఖ్యకు చేరుకుంది. అక్కడి నుండి ఈ సంస్థ ప్రస్థానం శరవేగంగా సాగింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కర్నాటక, కేరళ, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ఇలా దేశంలోని అన్ని రాష్ట్రాలకూ వ్యాపించింది. ఫ్రెండ్స్ టు సపోర్ట్ వెబ్‌సైట్‌లోకి వెడితే రక్తదాతలు దొరకడం ఖాయమన్న నమ్మకాన్ని నెలకొల్పింది.

గోప్యతను బద్దలు కొట్టాలి

రక్తదాతల వివరాలను బహిరంగ పరచడం, ఆపద సమయంలో అవసరమైన వారికి వారిని అందుబాటులో ఉంచడం ఈ సంస్థ ప్రత్యేకత. రక్తదాతల వివరాలను గోప్యంగా ఉంచే విధానాన్ని బద్దలు కొట్టాలన్నది ఈ సంస్థ లక్ష్యం. ఫ్రెండ్స్ టుసపోర్ట్.ఓఆర్‌జి వెబ్‌సైట్‌లోకి వెళ్లి చూస్తే రాష్ట్రం, జిల్లా, ప్రాంతాల వారిగా రక్తదాతల పేర్లతో పాటు వారి ఫోన్ నెంబర్లు కూడా కనపడతాయి. అవసరమైన వారు నేరుగా రక్తదాతకు ఫోన్ చేసి తమ వివరాలు చెబితే చాలు! అయితే, ప్రారంభంలో ఈ పద్ధతికి వ్యతిరేకత వచ్చింది. కొన్ని సంస్థలు దీనిని తప్పు పట్టాయి. రక్తదాతల వివరాలను బహిరంగ పరచకూడదని వాదించాయి. ఫ్రెండ్స్ టు సపోర్ట్‌తో కలిసి నడవడాన్నీ, ఆ సంస్థ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని బహిష్కరించాయి. రక్తదాతల వివరాలను బహిరంగ పరచకూడదన్నది వాటి వాదన! ప్రారంభం నుండి ఆ సంస్థ ఈ వాదనను తిరస్కరించింది. రక్తదాతలు ఎవరో సమాజంలో ప్రతి ఒక్కరికి తెలియాలని, వారి స్ఫూర్తితో మరికొందరు రక్తదాతలుగా మారుతారని, సమాజానికి ఇదే ఉపయోగమని వాదించింది. తమ పేర్లను బహిరంగ పరచడానికి అంగీకరించే వారినే తమ సంస్థలో సభ్యులుగా చేర్చుకుంటామని ప్రకటించి, అదే విధంగా చేస్తోంది. సభ్యులుగా నమోదు కావడానికి సమర్పించే పత్రంలోనే ఆ మేరకు నిబంధనను చేర్చింది. ఇప్పటికీ పలు సంస్థలు రక్తదాతల పేర్లను రహస్యంగా ఉంచుతున్న సంగతి తెలిసిందే. అన్ని బ్లడ్‌బ్యాంకులతో పాటు, రక్తదాన సంస్థలు తమ సభ్యుల వివరాలను బహిరంగ పరచాలని, ఆ మేరకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఈ సంస్థ కోరుతుంది. ఈ క్రమంలో భాగంగానే 'బ్లడ్ డోనర్స్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించింది. 'ఐస్ బక్కెట్ ఛాలెంజ్' స్ఫూర్తితో చేపట్టిన ఈ కార్యక్రమంలో రక్తదానం చేసిన వారు తమ ఫోటోతో పాటు మొబైల్ నంబర్‌నూ ఫేస్‌బుక్, ట్విటర్లలో ప్రకటించాలని కోరింది. గత నెలలో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ఇప్పటిదాకా పదివేల మంది స్పందించారు.

బెదిరింపులు ... హుంకరింపులు...

సంస్థ సభ్యత్వం 50 వేలకు చేరడంతో రాష్ట్రంలో పలువురి దృష్టి ఈ సంస్థపై పడింది.

రక్తదాతలను పెంచడమే లక్ష్యం!

-షరీఫ్

ప్ర: మీ భవిష్యత్ లక్ష్యాలు ....

జ: అవసరమైన సమయంలో రక్తం అందక చనిపోతున్న వారి సంఖ్య ఇంకా భారీగానే ఉంది. బ్లాక్ మార్కెటింగ్, దళారీల వ్యవస్థ కొనసాగుతోంది. దీనిని నివారించాలంటే రక్తదాతల సంఖ్యను పెంచడమే మార్గం. మా సంస్థలో ప్రస్తుతం 1.50 లక్షల మంది సభ్యులున్నారు. రానున్న ఐదు సంవత్సరాల్లో దీనిని 10 లక్షలకు చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం.

ప్ర: మారుమూల ప్రాంతాలకూ మీ సేవలు అందుతున్నాయా?

జ: సభ్యులున్న చోట అందుతున్నాయి. కొన్నిచోట్ల లేరు. అక్కడ సభ్యులను చేర్చుకోవాలి. మా వాలంటీర్ల ద్వారా ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నాం. రక్తదాతల సంఖ్యను భారీగా పెంచడం ఒక్కటే మార్గం.

ప్ర: ఇంటర్నెట్ ఆధారిత వ్యవస్థ కదా... అందరికి అందుబాటులో ఉంటోందా?

జ: ఈ ప్రశ్న మేం ప్రారంభించినప్పటి నుండి వస్తోంది. ఒక్క హైదరాబాద్‌లోనే రోజుకు కనీసం వందమంది మా సంస్థ సభ్యులు రక్తదానం చేస్తున్నారు. మిగిలిన వారికి కూడా అందుబాటులో ఉంచటానికి టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నాం. దానికి కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. అధిగమించే ప్రయత్నం చేస్తున్నాం.

ప్ర: ప్రభుత్వం నుండి సహకారం ఏమైనా ఉందా?

జ: ప్రభుత్వం నుండి ఇప్పటివరకు మేం ఏమి ఆశించలేదు. వెబ్‌సైట్‌కు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రచారం కల్పించాలని గతంలో కోరాం. దానికి స్పందన కనిపించలేదు.

ప్ర: రక్తదానం కాకుండా... ఇతర సామాజిక సమస్యలపై స్పందించరా?

జ: విద్యారంగంలో కొంత కృషి చేస్తున్నాం. మా సంస్థ సభ్యుల సహకారంతోనే ఈ కృషి జరుగుతోంది. రక్తదానమే పెద్ద సామాజిక సమస్య. పేదరికం, అవిద్య, మూఢనమ్మకాలు, నిరుద్యోగం వంటి అంశాలు దీనిలో ఇమిడి ఉన్నాయి. మా పరిధి మేరకు మేం పని చేస్తున్నాం.

కొందరు ప్రశంసల వర్షం కురిపిస్తే మరికొందరు బెదిరింపులకూ దిగారు. వీరిలో కొందరు 'పెద్దలూ' ఉన్నారు. వెబ్‌సైట్ నిర్వహణ నుండి తప్పుకుని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. 'మాకు అప్పగించకపోతే మీ సంగతి చూస్తాం...' అనే వారు కొందరైతే, 'మమ్మల్ని కాదని మీరు ఎలా నిర్వహించగలరు?' అని బెదిరించే వారు మరికొందరు. రాజకీయ నాయకుల వారసుల ఆరంగ్రేటం సందర్భంగా ఈ తరహా బెదిరింపులు వచ్చేవి. వీటిని ఖాతరు చేయకపోవడంతో వెబ్‌సైట్‌లో ఉన్న డేటా బేస్ మొత్తాన్ని కాపీ చేసి తమ పేరుతో ప్రకటించుకున్న వారూ ఉన్నారు. రక్తదాతల సమాచారాన్ని వీలైనంత ఎక్కువ మందికి తెలియ చేయడమన్న తమ లక్ష్యం నెరవేరడంలో భాగంగానే ఆ తరహా చర్యలను ఫ్రెండ్స్ టు సపోర్ట్ భావించింది. అయితే, అలా చేసిన వారు అక్కడితోనే ఆగిపోయారు. నిర్వహణలో చిత్తశద్ధి లేకపోవడంతో అంతకు మించి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయారు.

అగ్రరాజ్యం అవమానించింది!

కుల మతాలకు అతీతంగా ఆపదల్లో ఉన్న వారందరినీ ఆదుకోవాలన్న లక్ష్యంతో ప్రస్థానం సాగిస్తున్న ఈ సంస్థకూ అగ్రరాజ్యం నుండి అవమానం ఎదురైందంటే నమ్మశక్యం కాదు. కానీ అక్షరాలా అదే జరిగింది. 2009వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థయైన యునిసెఫ్ ప్రతిష్టాత్మక యువసమ్మేళన అవార్డును ఫ్రెండ్స్ టు సపోర్ట్ వ్యవస్థాపకులు షరీఫ్‌కు ప్రకటించింది. మెక్సికోలో జరుగుతున్న కార్యక్రమానికి హాజరై అవార్డు తీసుకోవాలని ఆ సంస్థ కోరింది. దీనికి సంబంధించిన వీసానూ ఆ సంస్థే ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నుండి బయలుదేరిన విమానం చికాగోలో కొన్ని గంటలు ఆగాల్సి ఉంటుంది. షరీఫ్ అనే పేరుతో ఉన్న వ్యక్తి తమ దేశంలో కొద్దిసేపైనా ఉండటానికి అమెరికన్ అధికారులు అంగీకరించలేదు. అక్కడి నుండి వచ్చిన ఆదేశాలతో ఢిల్లీలోనే విమానశ్రయ అధికారులు షరీఫ్‌ను దించేశారు. అంతేకాదు. గంటల తరబడి ప్రశ్నల వర్షం కురిపించారు. ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకున్నా అమెరికన్ అధికారుల నుండి సానుకూల స్పందన వ్యక్తం కాలేదు. బలవంతంగా వెనక్కి పంపించారు. ఈ పరిణామంపై సంస్థ సభ్యులు ఆ తరువాత గవర్నర్, రాష్ట్రపతికి ఫిర్యాదులు చేశారు. 2009వ సంవత్సరంలో అవార్డును ప్రతక్షంగా అందుకోలేక పోయినప్పటికీ, 2012లో అదే అవార్డును యునిసెఫ్ ప్రకటించింది. ఈ సారి శ్రీలంకలో అవార్డుల బహుకరణ కార్యక్రమం జరగడంతో ఎటువంటి అవాంతరాలు ఎదురు కాలేదు.

ఆ నలుగురూ ...!

ఫ్రెండ్స్ టు సపోర్ట్ (friends2support.org) ను ప్రారంభించిన నలుగురు యువకులు పూర్తిగా గ్రామీణ ప్రాంతానికి చెందిన వారే కావడం విశేషం.

రక్తదానం ... వాస్తవాలు



- ✧ ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా 4కోట్ల యూనిట్ల రక్తం అవసరమవుతోంది. ఈ డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేదు. కేవలం 40 లక్షల యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉంటోంది.
- ✧ రక్తం ఇవ్వడమంటే ప్రాణం ఇవ్వడమే! రక్తానికి ప్రత్యామ్నాయం లేదు.
- ✧ ప్రతి రెండు సెకండ్లకు దేశవ్యాప్తంగా ఏదో ఒక ప్రాంతంలో రక్తం అవసరమవుతోంది.
- ✧ ఒక దాత నుండి ఒక యూనిట్ రక్తం మాత్రమే తీసుకుంటారు. సాచెట్ సైజు 360 ఎంఎల్ నుండి 450 ఎంఎల్ వరకు ఉంటుంది.
- ✧ ఒక సాచెట్ రక్తాన్ని మూడు రకాలుగా విభజించి రోగులను కాపాడే అవకాశం ఉంది. ప్లేట్‌లెట్స్, ప్లాస్మా, రక్తంగా ఈ విభజన ఉంటుంది. అంటే ఒక్కసారి రక్తదానం చేస్తే దానిని ముగ్గురు రోగుల ప్రాణాలు కాపాడటానికి వినియోగించవచ్చు.
- ✧ ఆస్పత్రుల నుండి ఎక్కువగా 'ఓ' టైపు రక్తానికి డిమాండ్ ఉంటుంది.
- ✧ సికిల్ సెల్, తలసేమియా వ్యాధుల బారిన పడిన వారికి తరచుగా రక్తం అవసరమవుతుంది.
- ✧ క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఇటీవల కాలంలో పెరుగుతోంది. కిమియో థెరఫీలో భాగంగా వీరికీ రక్తం అవసరమవుతోంది.
- ✧ తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు ఒక్కోసారి 50 యూనిట్ల నుండి 100 మూనిట్ల వరకు రక్తం ఎక్కించాల్సిఉంటుంది.
- ✧ సరైన పోషకాహారం లేక దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యల మహిళలు రక్తహీనతతో బాధ పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీరి సంఖ్య అత్యధికం.
- ✧ రక్తాన్ని లాబరేటరీల్లో తయారు చేయలేం. దీనిని నమ్మకమైన దాతల నుండి సేకరించాల్సిందే.
- ✧ 'ఓ నెగిటివ్' రక్తాన్ని (ఎర్ర రక్తకణాలు) అన్ని గ్రూపుల వారికి ఇయ్యవచ్చు. దీనికి తీవ్రమైన డిమాండ్ ఉంది. కొన్ని సందర్భాల్లో దొరకని సంఘటనలు నమోదవుతున్నాయి.
- ✧ వాస్తవ రక్తదాన ప్రక్రియకు 10 నుండి 12 నిమిషాల సమయం మాత్రమే పడుతుంది.
- ✧ సగటున ప్రతి మనిషి శరీరంలో 10 యూనిట్ల రక్తం ఉంటుంది. దీనిలో ఒక్క యూనిట్ రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు.
- ✧ ఆరోగ్యవంతుడైన దాత 56 రోజుల్లో మరోసారి రక్తదానం చేయవచ్చు.
- ✧ ప్లేట్‌లెట్ డోనర్ ప్రతి వారం రోజులకు ఒక్కసారి ఇవ్వవచ్చు. ఏడాదికి గరిష్టంగా 24 సార్లు ప్లేట్‌లెట్స్ ఇవ్వొచ్చు.

దుర్వినియోగం!

రక్తదానం పవిత్రమైన ప్రక్రియ. ఆరోగ్యవంతుల నుండే రక్తాన్ని సేకరించాలి. అవసరమైన అన్ని పరీక్షలు చేసిన తరువాత ఆరోగ్యవంతమైన రక్తమని నిర్ధారణ అయితేనే రోగికి ఎక్కించాలి. అన్ని బ్లడ్‌బ్యాంకులు, ఆస్పత్రులు ఈ నిబంధన తప్పని సరిగా పాటించాలి. అయితే, అనేక సందర్భాల్లో ఈ నిబంధన పాటించడం లేదంటూ

వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. అనేక అస్పత్రుల వద్ద దళారులు తిష్ట వేస్తున్నారు. అవసరాన్ని బట్టి వెయ్యి నుండి రెండు మూడు వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. వ్యసనపరులు, అనారోగ్యవంతుల నుండి రక్తాన్ని ఇప్పిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు అనేక ఇతర ప్రాంతాల్లోనూ ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఈ తరహా చర్యలను వ్యతిరేకించాలి. రోగికి ఆరోగ్యకరమైన రక్తం అందేలా చూడాలి. స్వచ్ఛంద రక్తదాతల సంఖ్య భారీగా పెరిగి, అందరికి అందుబాటులో ఉన్నప్పుడే ఈ పరిస్థితి మారుతుంది.

భారీ రక్తదాన శిబిరాల్లో సేకరిస్తున్న రక్తమూ ఎక్కువసార్లు వృధా అవుతోంది. సామర్థ్యాన్ని మించి సేకరించిన రక్తాన్ని నిలువ చేయడం సాధ్యం కాకపోవడంతో కొన్ని సందర్భాల్లో పారబోసినట్లు వార్తలు వచ్చాయి. నిల్వ చేసిన రక్తం కూడా నిర్దేశించిన సమయంలో వినియోగించలేక నిరుపయోగంగా మారిన సంఘటనలూ ఉన్నాయి. దాత నుండి అప్పటికప్పుడు సేకరించిన రక్తాన్ని వినియోగించడానికే డాక్టర్లు ఎక్కువ సమయాల్లో మొగ్గు చూపుతున్నారు. రక్తదాతలు ఈ విషయాలను గమనించాలి.

చైతన్యపర్చడమే మార్గం!

చైనా విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో రెడ్ ఆర్మీ లాంగ్ మార్చ్ జరుగుతున్న రోజులవి. శత్రు సైనికులతో ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సైనికులు సైతం రక్తదానం చేయడానికి నిరాకరించేవారు. ఎర్రసైన్యంతో కలిసి ఆ పోరాటంలో పాల్గొన్న డాక్టర్ నార్మన్ బెతూన్ యుద్ధంలో గాయపడిన సైనికులకు వైద్య సహాయం అందించేవారు. యుద్ధ రంగంలో తీవ్రంగా గాయపడిన వారికి తక్షణమే రక్తాన్ని ఎక్కిస్తే బతికే అవకాశం ఉన్నప్పటికీ రక్తదాతలు అందుబాటులో లేకపోవడంతో పెద్ద సంఖ్యలో మృత్యువాత పడ్డారు. ఈ పరిస్థితిని మార్చడానికి ఆయన స్వయంగా తన రక్తాన్ని గాయపడిన సైనికుడికి గ్రామస్తుల సమక్షంలో ఎక్కించారు. ఆ సందర్భంగా గ్రామస్తుల స్పందన ... **'రక్తాశ్రువులు'** పుస్తకం నుండి క్లుప్తంగా:

'మొదటి నెత్తురు చుక్క సీసాలోకి ఎర్రగా పడగానే గ్రామస్తుంతా విస్మయంలో మునిగిపోయారు. సీసా 300 ఘన సెంటీమీటర్లు దాకా నిండే వరకు బెతూన్ స్ట్రెచర్ మీద వెల్లకిలా పడుకున్నాడు. సీసా అంత దాకా నిండగానే చప్పున చేతి నుండి సూది లాగి, అక్కడ చేతికి జిగురుగా ఉండే గాజు గుడ్డ పట్టీని అంటించాడు. లేచి కూర్చుని గ్రామస్తుల వైపు తిరిగి 'నేను ఇంతకు ముందు ఎలా ఉన్నానో ఇప్పుడు అలానే ఉన్నాను. మీరే చూశారు కదా! ఈ రక్తాన్ని గాయపడ్డ సైనికునికి ఎక్కిద్దాం. ఏమవుతుందో చూద్దాం...' అన్నారాయన. స్పెయిన్ యుద్ధ రంగంలో ఆర్జించిన విశేషానుభవంతో స్థిరంగా సూదిని ఆ సైనికునికి గుచ్చి పడిపోకుండా దానిని కుదురుగా నిలబెట్టి వెనకకు అడుగు వేసి రక్తపు సీసాను ఎత్తి పట్టుకున్నాడు. గ్రామస్తులు తమలో తాము గుసగుసలాడుకుంటూ దగ్గరగా తోసుకువచ్చి నిశ్శబ్దంగా నిలబడ్డారు. వాళ్ల కళ్లన్నీ సైనికుని ముఖం మీదే నిలిచిపోయాయి, యేం జరుగుతోందోనని బితుకు బితుకుమంటూ వేచి చూస్తున్నారు. అక్కడ గంభీర నిశ్శబ్దం వ్యాపించింది. సీసాలో రక్తం క్రమంగా ఖాళీ అయింది.

గుంపులో ప్రతి ఒక్కరూ ముందుకు వొంగి చూడాలని ఉన్నట్లుగా కనిపించారు. సైనికుని పెదాలు కదిలాయి. కళ్లు విప్పి నెమ్మదిగా తలెత్తి చూసి చిరునవ్వు నవ్వాడు. గుంపులోంచి జనం గొంతెత్తి అరిచారు. ఆనందం, నిశ్చింత, ఆశ్చర్యం, విజయం అన్ని కలిపిన హర్షధ్వానం అది. ముడతలు పడ్డ ముఖం, వొంగిపోయిన గూడు, మెరిసే కళ్లతో ఒక వృద్ధురాలు ముందుకొొచ్చి 'నేను ముసలిదాన్ని, ఎందుకు పనికి రాని దాన్ని, నా రక్తం ఇస్తాను తీసుకోండి' అంది. బెతూన్ అప్యాయంగా ఆమె చేతిని నొక్కి జనం వైపు తిరిగి 'ఇంకా ఎక్కువ మంది గాయపడినప్పుడు రక్తం ఎక్కువ అవసరం అవుతుంది. మీరంతా కలిసి రక్తదాతల జట్టుగా ఏర్పడతారా? మన సైనికులు మళ్ళీ శత్రువులతో పోరాడటానికి వీలుగా మీరంతా రక్తదానం చేస్తారా?' అని అడిగారు. గ్రామస్తులంతా వురవడిగా ముందుకొచ్చారు. 'ఆ... మేమంతా ఇస్తాం' అని అరిచారు. చైనాలో రక్తదాతల జట్టు అంటూ ఒకటి యేర్పడటం అదే మొదటిసారి. తర్వాత బెతూన్ పర్యటించిన అనేక ఇతర గ్రామాల్లో, చిన్న చిన్న నగరాల్లో అటువంటి జట్లు అనేకం ఏర్పాటయ్యాయి. ' ఇటువంటి చైతన్యం అందరిలో కల్పించాల్సిన అవసరం ఉంది.

180కి పైగా బ్లడ్‌బ్యాంకులు

ఆంధ్రప్రదేశ్‌లో దాదాపుగా 180కి పైగా బ్లడ్‌బ్యాంకు (రక్త నిధి కేంద్రాలు) ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రభుత్వం నుండి అనుమతి పొందిన వివిధ ప్రైవేటు ఆస్పత్రులు, సంస్థలు వీటిని నిర్వహిస్తున్నాయి. జిల్లా కేంద్ర ప్రభుత్వ అస్పత్రిలో బ్లడ్‌బ్యాంకును తప్పనిసరిగా నిర్వహిస్తున్నారు. రెడ్‌క్రాస్ సంస్థ రాష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ బ్లడ్‌బ్యాంకులను ఏర్పాటు చేసింది. ఎన్‌టిఆర్ ట్రస్టుకూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బ్లడ్‌బ్యాంకులను నిర్వహిస్తోంది. పలు సందర్భాల్లో ఈ సంస్థ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్‌లోని చిరంజీవి ఛారిటిబుల్ ట్రస్టు కూడా బ్లడ్‌బ్యాంకును నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సంస్థ కూడా రాష్ట్ర వ్యాప్తంగా పలు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తోంది. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ వంటి సంస్థలతో పాటు జన విజ్ఞాన వేదిక, డివైఎఫ్‌వై వంటి సంఘాలు రక్తదాతల జాబితాలో అవసరమైన సమయంలో ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇవిగాక నెల్లూరు జిల్లాలోని సింహపురి రక్తదాతల సంస్థ వంటి స్వచ్ఛంద సంస్థలు కూడా రక్తదాన రంగంలో విశేష కృషి చేస్తున్నాయి.

గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఇ.నవీన్‌రెడ్డి, నరసరావుపేటకు చెందిన కె. ఫణిసుందర్, ఈపూరు మండలం ఇనుమెళ్ళకు చెందిన షేక్ ఖాసీం షరీఫ్, నరసరావుపేటకు చెందిన కోటేశ్వరరావులు స్థానిక ఎస్‌కెఆర్‌బిఆర్ హైస్కూల్‌లో కలిసి చదువుకున్నారు. పెద్దయిన తరువాత కూడా వీరి స్నేహం కొనసాగింది. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకోవడం, ఉద్యోగాల వేటలో ఎదురైన అనుభవాలు వీరిలో సామాజిక స్పృహను పెంచాయి. సమాజం కోసం ఎదోఒకటి చేయాలని తపించేవారు. రక్తదానం చేయడానికి కొందరు భయపడటం, కొందరు వ్యసనపరులు దానిని ఆదాయమార్గంగా ఎంపిక చేసుకోవడం వంటి సంఘటనలు ఆలోపింపచేశాయి. సమయానికి రక్తం అందక చనిపోయిన వారిని దగ్గరనుండి చూసిన తరువాత ఆ రంగంలోనే ఏదో ఒకటి చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. అప్పటికే ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో డిజైనర్ మేనేజర్‌గా పనిచేస్తున్న షరీఫ్‌కు రక్తదాతల డేటాబేస్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, విస్తృత ప్రచారానికి వీలుగా వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చింది. దీనికి మిగిలిన ముగ్గురు మిత్రులు అంగీకరించారు. అలా ఫ్రెండ్స్‌టుసపోర్ట్ వెబ్‌సైట్ పురుడు పోసుకుంది. వీరిలో నవీన్‌రెడ్డి ప్రస్తుతం యుఎస్‌లో ఉన్నారు. షరీఫ్‌తో పాటు మిగిలిన వారికి విదేశాల్లో అవకాశాలు వచ్చినా ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నారు.

అందుబాటులో రక్తదాతలు

ఫ్రెండ్స్ టు సపోర్ట్ ఆవిష్కరణతో రక్తదాతల సమాచారం ప్రజలందరికి అందుబాటులో వచ్చింది. ఆపద సమయాల్లో అవసరమైన వారు వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ రాష్ట్రం, జిల్లా, పట్టణాల వారిగా రక్తదాతల ఫోన్ నెంబర్లను పొందవచ్చు. దీనికోసం వెబ్‌సైట్‌లో ప్రముఖంగా సెర్చ్ (వెదికే) ఆప్షన్‌ను రూపొందించారు. వెబ్‌సైట్‌లోకి వెడితే ముందుగా కనపడేది అదే. రాష్ట్రం, జిల్లా తదితర వివరాలు నమోదు చేయగానే ఆ ప్రాంతంలోని రక్తదాతల ఫోన్ నంబర్లు అందుబాటులోకి వస్తాయి. గత ఏడాది మొబైల్ అప్లికేషన్లనూ అందుబాటులోకి తీసుకు వచ్చారు. అన్ని రకాల ఫోన్ల నుండి ఎఫ్2ఎస్‌ను వినియోగించుకోవడం ద్వారా ఉన్న చోటునుండే రక్తదాతల వివరాలను తెలుసుకునే సౌలభ్యమూ కలిగింది. కేరళ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఆ సంస్థ కార్యకర్తలు ఈ మొబైల్ అప్లికేషన్లను రూపొందించారు. వీటి సహాయంతో ఆపద సమయంలో రక్తదాతల వివరాలు తెలుసుకోవడంతో పాటు, రక్తదాతలుగా ప్రతి ఒక్కరు నమోదు చేయించుకోవాలని friends2support.org కోరుతోంది.

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

పారిస్, 1845

ఇంగ్లండు నుండి జర్మనీకి తిరిగివెళుతూ పారిస్‌లో ఆగాడు ఎంగెల్స్. క్రితం సంవత్సరం రూగ్ పత్రికకు, పొలిటికల్ ఎకానమీ గురించి ఒక అద్భుతమైన ఆర్టికల్ రాసిన వ్యక్తిగా, అప్పటికే అతడి పేరు మార్క్స్‌కు తెలుసు. 'రైనిష్ జైటుంగ్' నడుపుతున్న 'నియంత' ఎవరో ఎంగెల్స్‌కూ తెలుసు. అయినా మార్క్స్ రచనలంటే అతడికి చాలా ఇష్టం. ఆగస్టు 28, 1844 నాడు కెఫెడిలా రీజెన్స్‌లో సమావేశమైన ఇద్దరూ పది పగళ్లు, పది రాత్రులు విరామం లేకుండా మాట్లాడుకున్నారు. మామూలుగా అక్కడ చదరంగం క్రీడాకారులు కలుస్తుంటారు. ఆ రకంగా వీళ్లిద్దరి సమావేశానికది సరైన వేదికే.

ఇరవై మూడేళ్ల ఎంగెల్స్ సన్నగా, పొడుగ్గా మంచి డ్రెస్సు వేసుకొని హుందాగా ఉన్నాడు. తండ్రి ఫ్యాక్టరీ యజమాని. ఆయన సూచనతో, పదిహేడో ఏట చదువు ముగించి, ఫ్యాక్టరీ వ్యవహారాలలో మునిగిపోయాడు. ఆహార్యంలో అతనికీ, మార్క్స్‌కూ పోలికే లేదు – తాగుడులో తప్ప. మార్క్స్‌ను చూసి అతడెలాంటివాడో సులభంగా తెలుసుకోవచ్చు. కాని ఎంగెల్స్ అలా కాదు. పైకి, అతడు ఘరానా మనిషి. పైలాపచ్చీసుగా తిరిగే పడుచు కుర్రాడు. కాని ఆయన లోపలి విప్లవ భావాలను, మేధో పరిణితిని పసిగట్టడం ఓ పట్టాన సాధ్యపడదు. అప్పటికే ఒక ఐరిష్ ఫ్యాక్టరీ యువతితో సహజీవనం గడుపుతున్నాడు. ఇంకా, ఇరవైఏళ్లు కూడా నిండనప్పుడే అనియంత్రిత పారిశ్రామికికీరణ వల్ల కలిగే సామాజిక దుష్ఫలితాల గురించి వార్తా పత్రికల్లో ఘాటైన వ్యాసాలు రాశాడు. అలాంటి ఈ విప్లవ యువకుడు ఆగస్టులో మార్క్స్‌ను కలిశాడు. మార్క్స్, అతడి అభిప్రాయాలనూ, 'అలవాట్లనూ' పూర్తిగా ఆమోదించాడు.

"ఆమె ద్వారా మాంచెస్టర్‌లోని నరులుండే నరకలోకాన్ని దర్శించాడు ఎంగెల్స్. ఆనాటి ఐరిష్ ఫ్యాక్టరీ కార్మికులతో పోలిస్తే నరకంలోనైనా మనుషులు సులభంగానే ఉండగలరేమో! అక్కడ పారిశుధ్యం ఆనవాలు కూడా లేదు. మూత్రపు మడుగుల్లో జంతువులు కుళ్లిపోతున్నాయి. ఎక్కడ చూసినా పందుల కొట్టాలే. చీలమండల లోతు బురదలో నడవ దలచుకుంటే తప్ప అక్కడికి వెళ్లకూడదు. 'మనుషులెలా వుంటున్నారిక్కడ?, ఎలా ఉండగలుగుతున్నారు?' అని ఆశ్చర్యపోయాడు ఎంగెల్స్."

ఫ్యాక్టరీ యజమానిగా ఎంగెల్స్‌కు పెట్టుబడిదారీ మనస్తత్వం, వ్యాపార రహస్యాలు పూర్తిగా తెలుసు. అయినప్పటికీ తన విప్లవ నిబద్ధతతో అదే వ్యవస్థ సృష్టిస్తున్న అసమానతలను, దుష్ఫలితాలను ఎండగడుతూ విశ్లేషణాత్మకంగా, ఘాటైన వ్యాసాలు కూడా రాయగలడు. పారిశ్రామికీకరణ పరిణామాలను కూలంకషంగా అవగాహన చేసుకున్నాడు ఎంగెల్స్. పెట్టుబడిదారుల మనస్తత్వాన్ని, వాళ్ల కుట్రలను మార్క్స్‌కు తెలియజెప్పటానికి వచ్చిన దూత తాను.

ఇరవై ఆరేళ్ల మార్క్స్ మేధో పటిమ, వ్యక్తిత్వం చూసి 'ఇలాంటివారి పరిచయమే మహద్భాగ్యం' అనుకున్నాడు ఎంగెల్స్. తన భావాలకు చేయూతనిచ్చే వ్యక్తి, తన కృషిలో భాగస్వామి ఒకరు కావాలి. ఆ అరుదైన వ్యక్తి మార్క్స్ తప్ప మరెవరూ కాలేరని తెలిసిపోయింది. 'అన్ని

సైద్ధాంతిక విషయాలపైన ఏకాభిప్రాయం కుదిరింది. మా సమిష్టి కృషి ఆ క్షణం నుండే ప్రారంభమైంది' అంటూ తన చారిత్రక సమావేశాన్ని వర్ణించాడు ఎంగెల్స్. అంతేనా, ఆర్థిక సమస్యలతో నిరంతరం కొట్టుమిట్టాడిన మార్క్స్‌ను మునిగిపోకుండా ఆదుకున్నాడు. ఎంగెల్స్ లేకపోతే, మార్క్స్ కృషి కొనసాగేదే కాదు. ఆ కుటుంబ మనుగడే ప్రశ్నార్థకంగా మారినప్పుడు 'నేనున్నానని' నిల్చిన రక్షకుడు ఎంగెల్స్.

పద్దెనిమిదవ శతాబ్దంలో ప్రష్యాలోని వుప్పెర్టాల్ ప్రాంతంలో జౌళి (textile) వ్యాపారం ప్రారంభించాడు ఎంగెల్స్ ముత్తాత. ఆ తర్వాత రైన్‌లాండ్ (జర్మనీలోని పశ్చిమ ప్రాంతం)లో పారిశ్రామికాభివృద్ధి ఎక్కువగా జరిగిన నగరంగా గుర్తింపు తెచ్చుకుంది. అక్కడి బార్మెన్ (నగరం). వుప్పెర్ నది పారిశ్రామిక వ్యర్థాలతో కలుషితమై, నీళ్ల రంగు కూడా మారిపోయింది. మత ఛాందసత ఎక్కువగా ఉన్న కుటుంబంలో గడిచింది ఎంగెల్స్ బాల్యం. పిల్లలు కూడా మత గ్రంథాలు మాత్రమే చదవాలి. వినోదాలకు దూరంగా వుండాలి. ఈ నిర్బంధాన్ని సహించలేని ఎంగెల్స్, పదిహేనవ ఏటకే తిరుగుబాటు చేశాడు. తండ్రి శిక్షించినా లాభం లేకపోయింది. 'కథల పుస్తకాలు కూడా చదువుతున్నాడు కుర్రాడు. దేవుడే వాణ్ణి రక్షించాలి' అంటూ వాపోయాడాయన.

స్కూల్లో ఉన్నప్పుడు కవిత్వం పట్ల కొంత శ్రద్ధ కనపర్చాడు ఎంగెల్స్. పదిహేడో ఏట కొన్ని గీతాలు అచ్చయ్యాయి. సాహిత్య జీవితం గడపాలని కూడా అనుకున్నాడు. కాని తండ్రి అతణ్ణి వ్యాపార బాధ్యతలు తీసుకొమ్మని ఒత్తిడి చేశాడు. స్కూలు మాన్పించాడు. ఆ తర్వాత, ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌గా చేరిన తర్వాత ఎంగెల్స్‌కు తిరుగుబాటు భావాలు ఎక్కువయ్యాయి. మొదట, తన మిత్రుల్నీ, సహోద్యోగుల్నీ మీసాలు పెంచాలని ఒత్తిడి చేశాడు (ఆ రోజుల్లో మర్యాదస్తులు మీసాలు పెంచటం మర్యాదు కాదు!). చేతులకు గ్లోవ్స్ వేసుకోరాదు. ఇంకా ఇలాంటివి ఎన్నో. మొత్తం మీద, ఇన్నాళ్లూ నామకంగా వున్న అతణ్ణి వూర్లో అందరూ గుర్తుపట్టారు. ఆడపిల్లలకు ఈ పద్ధతులు నచ్చాయి.

అయితే, అతడి నిజమైన నిరసన లేఖల రూపంలో కొనసాగింది. 'ఫ్రీడ్రిక్ ఆస్వాల్డ్' పేరుతో 'లెటర్స్ ఫ్రం వుప్పెర్టాల్' ప్రచురితమై పెద్ద దుమారం లేపింది. పద్దెనిమిదేళ్ల ఎంగెల్స్, ఆరేళ్ల బాల కార్మికులు విష వాయువులు పీలుస్తూ ఫ్యాక్టరీలలో ఎలా పని చేస్తున్నారో, ఎలా తాగుడుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారో సోదాహరణంగా వివరించారు.

'వుప్పెర్టాల్‌లోని కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయం. ఇంచుమించు అందరూ సిఫిలిస్‌తో, వూపిరితిత్తుల జబ్బులతో బాధపడుతున్నారు. ఒక్క ఎచెర్‌ఫెల్డ్ (నగరం)లోనే అక్కడున్న 2500 మంది బాలబాలికలలో సగానికి సగం మంది ఫ్యాక్టరీలలో పని చేస్తున్నారు. ఫ్యాక్టరీ యజమాని పెద్దవాళ్లకిచ్చే కూలీలో సగం మాత్రమే బాల కార్మికులకిచ్చి పని



లిడియా (లిజ్జీ)

" ఇరవై ఆరేళ్ల మార్క్స్ మేధో పటిమ, వ్యక్తిత్వం చూసి 'ఇలాంటివారి పరిచయమే మహద్భాగ్యం' అనుకున్నాడు ఎంగెల్స్. తన భావాలకు చేయూతనిచ్చే వ్యక్తి, తన కృషిలో భాగస్వామి ఒకరు కావాలి. ఆ అరుదైన వ్యక్తి మార్క్స్ తప్ప మరెవరూ కాలేరని తెలిసిపోయింది. 'అన్ని సైద్ధాంతిక విషయాలపైన ఏకాభిప్రాయం కుదిరింది. మా సమిష్టి కృషి ఆ క్షణం నుండే ప్రారంభమైంది' అంటూ తన చారిత్రక సమావేశాన్ని వర్ణించాడు ఎంగెల్స్. అంతేనా, ఆర్థిక సమస్యలతో నిరంతరం కొట్టుమిట్టాడిన మార్క్స్‌ను మునిగిపోకుండా ఆదుకున్నాడు. "

చేయించుకుంటాడు. ఈ పాప ప్రక్షాళన కోసం, యజమానులు తప్పనిసరిగా చర్చికి వెళ్లి ప్రార్థనలు చేస్తారు. కొందరు యజమానులు, కార్మికులకు తాగుడు మాన్పిస్తామనే మిషతో కూలీ రేట్లు తగ్గించారు.

'మహిళలకు విముక్తి కలిగితే తప్ప మానవ జాతికి విముక్తి లేదు' అని కూడా వాదించాడు. 'ఆస్వాల్డ్' మరొక మిత్రుడికి రాసిన లేఖలో 'జర్మన్ ప్రభువు విల్హెల్మ్ విల్హెమ్ III అంటే నాకసహ్యం. ఇతడితో పోల్చితే, నెపోలియన్ సత్పురుషుడే. ప్రజలు ఎడాపెడా వాయిస్తే తప్ప ఏరాజూ బుద్ధిగా పరిపాలించలేదు. విప్లవ నినాదాల హోరులో, వాళ్ల ఏడంతస్తుల మేడలకు పగుళ్లు పడితే తప్ప ప్రజలకు న్యాయం జరగదు' అని రాశాడు.

1841లో అప్రెంటిస్‌షిప్ ముగించుకుని ఓ ఏడాదిపాటు మిలిటరీ సర్వీసు చెయ్యటానికి బెర్లిన్ వెళ్లాడు ఎంగెల్స్. అయితే, అక్కడికెళ్లటానికి అసలైన కారణం యూనివర్సిటీలోని 'యంగ్ హెగెలియన్ల' సాంగత్యంలో గడపటానికి అప్పటికే అతడు ప్రచురించిన ముప్పై మూడు వ్యాసాలు వాళ్లకు నచ్చాయి.

ఆ కాలంలో ఎంగెల్స్‌ను ప్రభావితం చేసిన ఒక వ్యక్తి (మార్క్స్ మిత్రుడు) మోజెస్ హెస్ – కమ్యూనిజంను ప్రచారం చేసిన తొలి తరం రాడికల్. 'విప్లవం అనివార్యం. ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లండుల నుండి అది వస్తుంది – రాజకీయంగా ఫ్రాన్స్, తాత్విక ప్రాతిపదికగా జర్మనీ, ఆర్థిక కారణాలలో ఇంగ్లండు విప్లవ కేంద్రాలు' అని నమ్మాడు. యాదృచ్ఛికమే కావచ్చు గాని తర్వాతి రోజుల్లో అతను ఇంగ్లండుకే వెళ్లవలసి వచ్చింది.

1837లో, ఎంగెల్స్ తండ్రి, ఎర్మెన్ సోదరులతో కలిసి, మాంచెస్టర్‌లో జౌళి మిల్లులు ప్రారంభించి, కొడుకును కూడా అదనపు ట్రెయినింగ్ కోసం అక్కడికే వెళ్లమన్నాడు. అప్పటికి ప్రపంచ పారిశ్రామిక కేంద్రం మాంచెస్టర్ (ఇంగ్లండు). అక్కడ, ఎర్మెన్ సోదరుల 'విక్టోరియా మిల్స్'లో శిక్షణ తీసుకోవాలి ఎంగెల్స్. ఇంతకన్నా మంచి అవకాశమేముంది! ఒక ఎంగెల్స్ వ్యాపార రహస్యాలు వంటబట్టించుకుంటాడు. మరొక ఎంగెల్స్ (విప్లవకారుడు) వ్యవస్థను కూలదోయటమెలాగో నేర్చుకుంటాడు. కొలోన్‌లో 'రైనిష్ జైటుంగ్' సంపాదకుణ్ణి (మార్క్స్) కలిసినప్పుడు ఎంగెల్స్‌తో మాట్లాడటానికే ఆసక్తి చూపలేదు మార్క్స్. అందువల్ల వాళ్ల పారిస్ సమావేశమే మొదటిదని అనుకోవచ్చు.

1842 నవంబర్‌లో ఎంగెల్స్, మాంచెస్టర్‌లో అడుగుపెట్టే నాటికి, జీతాలలో కోతకు నిరసనగా జరిగిన సమ్మెల నుండి అప్పుడప్పుడే కోలుకుంటున్నది నగరం. వాతావరణం ఉద్రిక్తంగా ఉంది. కార్మికులు అత్యంత పీడిత వర్గమే కావచ్చు గాని, బ్రిటిష్ రాజ్యాంగం వాళ్లకు గ్రూపులుగా ఏర్పడగలిగే హక్కు కల్పించింది– ఇదే వాళ్ల ఆశాకిరణం. అయితే అదంత సులభమేమీ కాదు. ఒక సామాజిక కార్యకర్త రాసినట్టుగా 'ధనిక, పేదల మధ్య అంతరం ఇక్కడున్నంత ఎక్కువగా మరెక్కడా లేదు'. కాని ఆ అంతరాన్ని అధిగమించటానికి ఎంగెల్స్‌కి ఒకరు తోడ్పడ్డారు. తనే పొందొమ్మిదేళ్ల ఐరిష్ యువతి మేరీ బర్న్స్. ఆమె, తన పదిహేడేళ్ల



1840 నాటి మాంచెస్టర్

"జెన్నీ, పారిస్ చేరుకునే నాటికి, 'కరపత్రం' రాస్తూ బిజీగా వున్నాడు మార్క్స్. అప్పటికి తన భర్తను అంతగా ఉత్తేజపరచిన కొత్త మిత్రుణ్ణి ఆమె చూడలేదు. కాని మార్క్స్, ఈ విరామం లేకుండా, ఎంగెల్స్ తనకు చెప్పిన మాంచెస్టర్ స్థితిగతులను, పెట్టుబడిదారీ విధానపు లోగుట్టునూ, చెబుతూనే వున్నాడు మార్క్స్. సిద్ధాంతమెప్పుడూ వాస్తవ పరిస్థితుల ఆధారంగానే వుండాలన్న నమ్మకం మరింత బలపడింది."

చెల్లెలు లిడియా (లిజ్జీ) ఎంగెల్స్ ఫ్యాక్టరీలో కార్మికులు. వాళ్లిద్దరికీ ఎలా పరిచయమైందో సరిగ్గా తెలియదుగాని, మొదటి చూపులోనే ఎంగెల్స్‌ని ఆకర్షించింది మేరీ. ఆమె ద్వారా మాంచెస్టర్‌లోని నరులుండే నరకలోకాన్ని దర్శించాడు ఎంగెల్స్. ఆనాటి ఐరిష్ ఫ్యాక్టరీ కార్మికులతో పోలిస్తే నరకంలోనైనా మనుషులు సులభంగానే ఉండగలరేమో! అక్కడ పారిశుధ్యం ఆనవాలు కూడా లేదు. మూత్రపు మడుగుల్లో జంతువులు కుళ్లిపోతున్నాయి. ఎక్కడ చూసినా పందుల కొట్టాలే. చీలమండల లోతు బురదలో నడవ దలచుకుంటే తప్ప అక్కడికి వెళ్లకూడదు. 'మనుషులెలా వుంటున్నారిక్కడ?, ఎలా ఉండగలుగుతున్నారు?' అని ఆశ్చర్యపోయాడు ఎంగెల్స్.

ఆశ్చర్యపడినంత మాత్రాన పరిస్థితి మారదు. తన తండ్రి ఫ్యాక్టరీ, ఇతర ఫ్యాక్టరీలలో పని చేసేవాళ్లంతా అక్కడే ఉంటున్నారు. వీళ్ల సృష్టించిన సంపదతోనే వాళ్లు విశాలమైన భవనాలలో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. ఆ క్షణాన ఎంగెల్స్‌కు అర్థమైందొక్కటే. బానిసల్ని ఒకేసారి అమ్మేస్తారు. వీళ్లు తమను తాము రోజూ అమ్ముకుంటున్నారు. కార్మికులు నిర్మించిన యంత్రాలు, ఫ్యాక్టరీలు, తమ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉపయోగపడుతున్నాయి. తమ సృష్టి తమనే కబళించి వేస్తుంది. ఈ పరిస్థితి మారాలి.

మేరీ ద్వారా పలువురు ఐరిష్, బ్రిటిష్ రాడికల్స్‌తో పరిచయమైంది. ఈ అమానవీయ పరిస్థితులు ఎంగెల్స్‌లో అసహనం పెంచాయి. ఏదో చెయ్యాలి. మార్పు రావాలి. ఏదైనా తక్షణమే జరగాలి. బ్రిటిష్ పత్రికలలో జర్మన్ కార్మికుల స్థితిగతుల గురించీ, జర్మన్ పత్రికలలో బ్రిటిష్ కార్మికుల గురించి వ్యాసాలు రాశాడు. వీటిలో ఐదు ఆర్టికల్స్‌ను, 1842లో రైనిష్ జైటుంగ్'లో (రచయిత పేరు ' X ' అని మాత్రమే ఉంటుంది) ప్రచురించాడు మార్క్స్. ఇంగ్లీష్ పత్రికలకు పంపిన వాటికి మాత్రం 'ఎఫ్. ఎంగెల్స్' అని సంతకం చేశాడు.

1843 నాటికి ఎకనమిక్స్, పాలిటిక్స్, హిస్టరీ గురించిన ఇంగ్లీష్ రచయితల గ్రంథాలన్నింటినీ అధ్యయనం చేశాడు ఎంగెల్స్. ఈ అధ్యయన ఫలితమే 25 పేజీల 'outlines of a critique of political economy' మార్క్స్ సంపాదకత్వం వహించిన రూగ్ పారిస్ పత్రికలో 1844లో ప్రచురితమైంది. బహుశా, అదే అప్పుడు ఆవిర్భవిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థను అభిశంసించిన తొలి 'మార్క్సిస్టు' రచన అయి వుంటుంది. 'ఫ్యాక్టరీ యజమానులు కొన్నిసార్లు ఉత్పత్తి పెంచి, మరికొన్నిసార్లు తగ్గించి (ఆ నెపంతో జీతాలలో కోతపెట్టి) సామాజిక అసమానతలను సృష్టించి, వర్గ సంఘర్షణకు దారితీసే పరిస్థితులను సృష్టిస్తున్నారు' అంటాడు ఎంగెల్స్ ఈ వ్యాసంలో. శ్రమ తగ్గించే యంత్రాల వల్ల కార్మికుల శ్రమ ఏమీ తగ్గలేదు. పైగా, నిరుద్యోగం పెరిగింది. ఫ్యాక్టరీలో కార్మికుల సంఖ్య తగ్గింది గనుక, వున్నవాళ్లు అదనంగా శ్రమించక తప్పటం లేదు. ఈ వ్యవస్థలో, పెట్టుబడిదారుకు లాభం అంటే కార్మికుడికి నష్టం' అన్నమాటే.

1844లో మార్క్స్‌ను కలిసేనాటికి, ఎంగెల్స్ కూడా అవే నిర్ధారణలకు వచ్చినా, వాటిని చేరిన మార్గం మాత్రం (మార్క్స్ కన్నా) భిన్నమైంది. ఏదిఏమైనా, ఇక, ముందుకు పోవాలంటే ప్రచారం తప్ప మరో మార్గం లేదనుకున్నారిద్దరూ. జర్మనీకి వెళ్లి, ఇంగ్లండులోని కార్మికుల స్థితిగతుల గురించి పుస్తకం రాస్తానన్నాడు ఎంగెల్స్. (ఇదే మనకు తెలిసిన క్లాసిక్ గ్రంథం (conditions of the working class in England) మార్క్స్ కూడా తను చేసిన అధ్యయనంతో రాజకీయ, అర్థశాస్త్రం (పొలిటికల్ ఎకానమీ) గురించి ఓ పుస్తకం ముగిస్తానన్నాడు. ఆ సెప్టెంబర్‌లో పారిస్ వదిలే నాటికి, తాము ఉమ్మడిగా చేపట్టబోయే మరో పుస్తకం కోసం పదిహేను పేజీల రాజకీయ కరపత్రం ఒకటి తయారు చేశాడు ఎంగెల్స్. తమ మాజీ సహచరుల తప్పుడు ఆలోచనా పద్ధతుల గురించిన విమర్శ అది. ఇదే మార్క్స్, ఎంగెల్స్‌ల తొలి ఉమ్మడి రచన The holy family or critique of critical criticism.

జెన్నీ, పారిస్ చేరుకునే నాటికి, 'కరపత్రం' రాస్తూ బిజీగా వున్నాడు మార్క్స్. అప్పటికి తన భర్తను అంతగా ఉత్తేజపరచిన కొత్త మిత్రుణ్ణి ఆమె చూడలేదు. కాని మార్క్స్, ఈ విరామం లేకుండా, ఎంగెల్స్ తనకు చెప్పిన మాంచెస్టర్ స్థితిగతులను, పెట్టుబడిదారీ విధానపు లోగుట్టునూ, చెబుతూనే వున్నాడు మార్క్స్. సిద్ధాంతమెప్పుడూ వాస్తవ పరిస్థితుల ఆధారంగానే వుండాలన్న నమ్మకం మరింత బలపడింది. ఈ మధ్యనే బ్రూనోబార్ ఓ వ్యాసంలో రాశాడు. 'మనుషులకు దారి చూపిస్తుంది చరిత్ర. అంతేకాని మనుషులు చరిత్ర చోదకులు కారు' అని. జన సామాన్యం పాల్గొన్న ఫ్రెంచి విప్లవం, అనేక సిద్ధాంతాలను తలకిందులు చేసింది. ఈ అవగాహనతో ప్రూధోను విమర్శించటానికి పూనుకున్నాడు మార్క్స్.

ఈ కరపత్రాన్ని వీలైనంత త్వరగా ప్రకటించాలి. కాస్త డబ్బయినా వస్తుంది. ఇదీ, కొలోన్ నుండి జార్జియుంగ్ మళ్లీ పంపిన డబ్బుతో, చింత లేకుండా సంసారం కొన్నాళ్లు గడుస్తుంది. ఫ్రెంచి ప్రభుత్వ సహకారంతో, ప్రష్యన్ ప్రభుత్వం 'ఫార్వర్డ్' పత్రికను నిషేధించగలిగితే, తను అరెస్టును తప్పించుకోలేడు. వీలైనంత త్వరగా రచన ముగించాలి. కాని మార్క్స్ స్వభావం అందుకు సహకరించదు. ఏదైనా పని చెయ్యాలనుకున్నప్పుడు అది ముగించటం అసాధ్యమవుతుంది. నవంబర్‌లోగాని రచన ఓ కొలిక్కి రాలేదు. ఎంగెల్స్ రాసిన పదిహేను పేజీలను మరో మూడు వందల పేజీలు జత గలిపాడు. ఇందులో ఎక్కువ భాగం, ఫ్రెంచి రచయిత యూజీన్ సూ రాసిన ఒక గోతిక్ (హారర్) నవల గురించిన విమర్శ.

సశేషం

▪ **ఫోన్: 91776 18708**

చక్రభ్రమణం

నమస్కారాలు వరుసకట్టాయి
కృతజ్ఞతల పర్వం ప్రారంభం
విశాల ఆటస్థలమిచ్చి
ఆడుకోమన్నందుకు
చక్కగా రహదారులు వేసి
పరుగులు తీసుకోమన్నందుకు
మేఘం ఆకాశానికి –
మెట్ట నేలలో వొదిగి
మట్టిగా మారనందుకు
తడి తగిలి
మొలకెత్తినందుకు
విత్తనం చినుకుకు –
సకాలంలో మొలకెత్తి
సస్యశ్యామలమైనందుకు
హరిత విప్లవమై
కర్షకానందం చేసినందుకు
నేల విత్తుకు –
నేల సారాన్ని తిని
పుష్టిగా పెరిగినందుకు
తావి అద్ది
సుగంధం పంచినందుకు
పువ్వు చెట్టుకు –
దూషణ పర్వం మొదలు
మంచి నీటిని మోసుకొచ్చి
నిల్వ గట్టమని అందిస్తే
ఉప్పు మయం చేసి
గరళం చేసినందుకు
నది సంద్రాన్ని –
ఎందుకు కన్నావో తెలియదు
ఎందుకు పుట్టానో తెలియదు
నేననేది లేకుంటే
నాకీ బాధలు వుండవు
బిడ్డ తల్లిని –
సంజాయిషీ పర్వం ఆరంభం
నిలగట్టింది ఆవిరై
వర్షంగా మారింది
ఏరులై పారి
దాహార్తి తీర్చింది
సముద్రం నదికి–
బిడ్డను కన్నాను
రాతను కాదు
గీత నీ చేతిలో వుంది
నీ రాత రాసుకో
తల్లి బిడ్డతో –
సమాప్త పర్వం సశేషం
ఇంకా వుంది –

అడిగోపుల వెంకటరత్నమ్

▪ ఫోన్: 9648252946



ఎక్కడున్నాయబ్బా!

హాయ్ పిల్లలూ...! ఈ బొమ్మలో మూడు చిన్ని పక్షి పిల్లలు దాక్కున్నాయ్. అవి ఎక్కడున్నాయ్ కనుక్కోండి చూద్దాం!

నా బొమ్మ



జి. సాకేత్ చౌదరి,
రెండవ తరగతి,
వికాస్ ఐఐటి ఒలంపియాడ్ స్కూల్
హైదరాబాద్.

పొడుపు కథ

అల్లుడు వచ్చాడు.
చొక్కా విప్పాడు,
నూతిలో దూకాడు.
ఎవరబ్బా?

ఆవు - పులి

కథ





అనగనగా ఒక అడవిలో పెద్దపులికి ఆకలి వేసి ఆహారం కోసం అడవి అంతా కలయ తిరుగుతుంది. ఇంతలో ఒక ఆవు పచ్చికలో మేత వెయ్యడం చూసి ఇక తనకు మంచి ఆహారం దొరికిందని ఆ ఆవును దగ్గరికి వచ్చి తినడానికి సిద్ధమవుతుంది.

అంతలో ఆ ఆవు తను చనిపోతే తన లేగ దూడకు ఎవరు పాలిస్తారు. ఉదయం సరిగ్గా పాలు కూడా ఇవ్వకుండా మేతకు వచ్చాను అని మనసులో బాధపడుతూ పులిని చూసి 'అయ్యా నేను ఈ మధ్యనే ఈనాను. నా పిల్ల ఇంకా నా పాలు తాగుతూనే ఉంది. అది పాలు తాగడానికి నా కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. నాపై దయ ఉంచి నా బిడ్డకు పాలిచ్చి రావడానికి అనుమతి ఇవ్వండి. తప్పకుండా తిరిగి వచ్చి మీకు నేను ఆహారం అవుతాను' అని జాలిగా ప్రాధేయపడింది.

ఆవు మాటలు ఎందుకో పులికి నమ్మబుద్ధి వేసి సరే నాకు బాగా ఆకలిగా ఉన్నా నీ మీద జాలితో నీకు అవకాశం ఇస్తున్నాను. వెళ్లి త్వరగా రా... అని చెప్పింది. తనకు అవకాశమిచ్చిన పులికి ధన్యవాదాలు తెలిపి ఆవు తన దూడ వద్దకు వెళ్లి దానికి కడుపు నిండా పాలిచ్చి మంచి బుద్ధులు చెప్పి దాని బాధ్యత తోటి పశువులకు అప్పగించి తిరిగి అడవిలో పులి ఉన్న ప్రదేశానికి వచ్చింది.

ఆవు నిజాయితీగా తన మాట మీద నిలబడి ప్రాణాలకు కూడా లెక్క చెయ్యకుండా తిరిగి రావడంతో సంతోషించిన పులి 'నేను బాగా ఆకలితో ఉన్నా నీ నిజాయితీకి మెచ్చి నిన్ను తినకుండా వదిలి పెడుతున్నాను. వెళ్లి నీ బిడ్డతో హాయిగా జీవించు' అని దాన్ని విడిచిపెట్టింది. పులి దయాగుణానికి ఆవు కృతజ్ఞతలు తెలిపి తన పాకకు పోయి తన బిడ్డతో హాయిగా జీవించసాగింది.

నీతి : మన నిజాయితీనే మనల్ని కాపాడుతుంది.

ఆకు తాబేలు

చిన్నారులు! మీకు తాబేలు బొమ్మ నేర్చుకోవాలనుందా..! అయితే ఒక పేపర్ పై ఆకును పెట్టేసి దాని చుట్టూ పై బొమ్మలాగా కాళ్లూ, చేతులు గీసేయండి.. అంతే.. తాబేలు బొమ్మ వచ్చేస్తుంది.

తొమ్మిది తేడాలు



మీకు కనిపిస్తున్న ఈ రెండు బొమ్మలూ ఒకేలా ఉన్నా... వీటిలో తొమ్మిది తేడాలున్నాయి.. మరి అవి ఎక్కడున్నాయో కనిపెట్టి సున్నా చుట్టేసేయండి.

జత చేద్దాం



మీకు జంతువులు తెలుసు కదా..! అయితే ఇక్కడున్న జంతువులు వాటి శరీర భాగాలు ఉన్నాయి. మీరు ఆ జంతువుల శరీరాన్ని గుర్తించి జత చేయండి.

‘త్తరాఃఢ ‘ఊఃజ ‘జ ఃఢ ‘ట్రాఊఃగ్ల ‘ఇ్ఱఃర : ణఊజ

పదాలేవి?

W	W	W	M	I	L	A	Z	S	D
D	Y	T	R	Y	G	W	S	O	H
P	R	W	A	J	B	Q	O	O	O
B	Z	A	F	R	M	E	B	K	E
R	V	G	Z	K	A	F	T	Y	I
M	N	O	O	I	L	U	O	B	O
X	O	D	Q	N	L	V	W	T	W
L	I	O	G	O	R	F	O	L	C
H	J	L	S	V	Z	R	R	X	D
V	J	K	O	E	W	U	G	E	F

LAMB
LIZARD
ZOO
DOG

FROG
FARM
MOOSE
OWL

ఇక్కడ ఎనిమిది జంతువుల పేర్లు ఇచ్చాం. అవన్నీ పైనున్న అక్షర సమూహంలో దాక్కున్నాయి. మరి మీరు వాటిని కనిపెట్టేస్తారా!

మితవాదులపై పోప్ వేటు

◆ సమ్‌థింగ్ స్పెషల్

ప్రపంచంలో ప్రతిదీ నిత్యం మారుతూనే ఉంటుంది. ఇదేదో పడక కుర్చీ వేదాంతం కాదు. శాస్త్రం, ఇందుకు ఎవరూ మినహాయింపు కాదు. ఈ పూర్వరంగంలో ప్రపంచంలో అతి పెద్దదైన క్రైస్తవమతంలో అనేక మార్పులు జరుగుతున్నాయి. ప్రస్తుత పోప్ ఫ్రాన్సిస్ వర్తమానంలో ఒక సంచలనంగా మారారంటే అతిశయోక్తి కాదు. జీవ పరిణామ సిద్ధాంతాన్ని అంగీకరిస్తూనే అది కూడా దేవుడి సృష్టి అని, దేవుడు దగ్గర మంత్ర శక్తులు లేవని పోప్ ప్రకటించారు. క్రైస్తవ మతంలో అభ్యుదయ శక్తులకు ఊతమిచ్చే విధంగా బైబిల్‌లో పేర్కొన్న అంశాలను వ్యాఖ్యానిస్తూ మితవాదుల ఆగ్రహావేశాలకు గురవుతున్నారు.

తాజాగా పోప్‌పై ధ్వజమెత్తిన ఒక అమెరికా కార్డినల్ రేమాండ్ బుర్కీని వాటికన్ ఉన్నత పదవి నుంచి నామమాత్ర బాధ్యతలకు బదిలీ చేసి పరోక్షంగా హెచ్చరించారు. బుర్కీపై చర్య తప్పదని సెప్టెంబరులోనే ఇటాలియన్ జర్నలిస్టు నివేదించాడు. చర్చి చట్టం ప్రకారం 75 సంవత్సరాలు దాటిన కార్డినల్స్ స్వచ్ఛందంగా రాజీనామా చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఆ తరువాత కూడా బాధ్యతల్లో కొనసాగించటం ఆనవాయితీగా వస్తోంది. అమెరికాలోని సెయింట్ లూయిస్ ఆర్చి బిషప్‌గా ఉన్న రేమాండ్ బుర్కీని 2008లో వాటికన్ ప్రధాన కోర్టు న్యాయమూర్తుల అధ్యక్ష పదవిలో నాటి పోప్ 16వ బెండిక్ట్ నియమించారు. ఆ పదవి నుంచి ఎలాంటి కారణాలు చూపకుండానే అసాధారణ రీతిలో నామమాత్ర పదవికి బదిలీ చేశారు. రోమ్‌లోని మాల్టా కేంద్రంగా పనిచేసే క్రైస్తవ సైన్య అధిపతి పదవిలో సాధారణంగా రిటైరైన కార్డినల్స్‌ను నియమించటం లేదా పని చేసే కార్డినల్‌కు అదనపు బాధ్యతగా అప్పగిస్తారు. దానికి దాదాపు ఎలాంటి బాధ్యతలు ఉండవని నేషనల్ కాథలిక్ రిపోర్టర్ పత్రికలో రాశారు.

బుర్కీ మితవాద ధోరణులు, బహిరంగంగా చేస్తున్న విమర్శల కారణంగా గత ఏడాది కాలంగా పోప్ క్రమంగా బుర్కీ ప్రాధాన్యతను తగ్గిస్తూ వచ్చారు. గర్భవిచ్ఛిత్తి, ఏక లింగ వివాహాల వంటి నైతిక విషయాలపై కాథలిక్ బోధనలను మార్చేందుకు పోప్ ఫ్రాన్సిస్ ప్రయత్నిస్తున్నారని అనేక మంది అమెరికన్లు భావిస్తున్నారంటూ వాటికన్ పత్రికలో బుర్కీ తన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రపంచ కార్డినల్స్ సమావేశంలో ప్రసంగించేందుకు జర్మన్ కార్డినల్ వాల్టర్ కాస్పర్‌ను పోప్ ఆహ్వానించారు. విడాకులు తీసుకున్న, మర్యాద పూర్వకంగా పునర్‌వివాహం చేసుకున్న కాథలిక్కులను తిరిగి మత సమ్మేళనాలకు ఆహ్వానించటాన్ని సులభతరం కావించేందుకు కాస్పర్ చేసిన ప్రతిపాదనను వ్యతిరేకించే వారికి బుర్కీ నాయకత్వం వహించాడు. గతనెలలో జరిగిన బిషప్పుల ధర్మ సభలో కాథలిక్ బోధనలకు భిన్నంగా జీవించే వారి పట్ల సఖ్య భావాన్ని వెల్లడించే పదజాలాన్ని మధ్యంతర నివేదికలో ఉపయోగించటాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకించాడు. తరువాత గత నెలాఖరులో ఒక పత్రికా విలేకరితో మాట్లాడుతూ అనేక మంది కాథలిక్కులు చర్చ్ అనే నావ చుక్కాని పోగొట్టుకున్నట్లుగా ఉందని భావిస్తున్నారని తీవ్ర విమర్శ చేశాడు.

నిజానికి బుర్కీ వాటికన్‌కు రాక ముందు కూడా పచ్చిమితవాద భావాలను వ్యక్తం చేశాడు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు 2004 సందర్భంగా అబార్షన్లకు అనుకూలమైన అభ్యర్థికి ఓటు వేయటం ఘోర పాపంగా వర్ణించాడు. అబార్షన్ల వంటి సాంస్కృతిక యుద్ధ సమస్యలపై మరీ ఎక్కువగా పీడిస్తున్నారని గతేడాది పోప్ చేసిన వ్యాఖ్యానంపై గర్భస్థ శిశువుల మారణకాండపై చర్చి ఎక్కువగా మాట్లాడకూడదని బుర్కీ ధ్వజమెత్తాడు. స్వలింగ సంపర్కులైన మతాధికారుల గురించి అడిగిన ఒక ప్రశ్నకు న్యాయాన్యాయ విచక్షణ చేయటానికి తానెవరినని పోప్ బదులిచ్చారు. దీనిపై కూడా బుర్కీ ధ్వజమెత్తాడు. స్వలింగ సంపర్కం వంటి అంశాలపై బహిరంగంగా తన వైఖరిని వివరించకుండా పోప్ ఎంతో హాని చేశారని, పోప్ నాయకత్వం చుక్కాని లేని పడవలా ఉందని తాజాగా ఒక స్పానిష్ పత్రికా ఇంటర్వ్యూలో ధ్వజమెత్తాడు.

పోప్ ఫ్రాన్సిస్ వాటికన్ నియామకాలలో గతానికి భిన్నంగా పశ్చిమ దేశాలకు వెలుపల ఉన్న ఆఫ్రికా వంటి వర్ధమాన దేశాల వారికి ఎక్కువ అవకాశాలనిస్తూ విశాల ప్రాతిపదికను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో మితవాదుల పట్టు సడలుతున్నది. బుర్కీ బదిలీ వారికి పెద్ద దెబ్బ. అమెరికాలో ఆఫ్రో అమెరికన్లు, కమ్యూనిస్టులపై దాడులకు పాల్పడినందుకు క్లక్స్ క్లాన్ వంటి పచ్చి మితవాదులతో పోల్చదగిన ఫ్రాన్సిస్ జార్జి చికాగో ఆర్చి బిషప్‌గా రిటైరయ్యాడు. ఆ స్థానంలో మధ్యేవాదిగా ఉన్న బిషప్ బ్లాసీ కుపిచ్‌ను నియమించారు పోప్ ఫ్రాన్సిస్. స్వలింగ సంపర్కులపై ధ్వజమెత్తవద్దని, అబార్షన్లకు వ్యతిరేకంగా సెమినార్లు, ఆసుపత్రుల ముందు ధర్నాల వంటివి చేయవద్దని కుపిచ్ కోరారు.

పోప్ ఫ్రాన్సిస్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి తనదైన శైలిలో పనిచేస్తున్నారు. ఈ ఏడాది 50 మంది ఉత్తమ నాయకులలో ఒకరిగా ఫార్చ్యూన్ పత్రిక ఎంపిక చేసింది. కుటుంబం గురించి చర్చ్ బోధనలను మార్చగలరా అన్న ప్రశ్న ఉంది. రోమ్‌లో గతనెలలో జరిగిన బిషప్‌ల ధర్మ సభలకు మూడు వారాల ముందు ఎంపిక చేసిన 20 జంటల వివాహానికి అధ్యక్షత వహించి తన మనోభావాన్ని వ్యక్త పరిచారు. వారిలో కొందరు సహజీవనం చేస్తున్నారు, మరికొందరికి పిల్లలు కూడా కలిగారు. వివాహ బంధం లేకుండా జీవిస్తున్న ఇలాంటి వారు పాపములో జీవిస్తున్నట్లు ఒకప్పుడు భావించారు. కుటుంబం పట్ల దృక్పథాన్ని మార్చుకోవాలన్న సందేశం పోప్ చర్యలో ఉంది.

ఆఫ్రికా నుంచి అనుమతి లేకుండా వలసలు వస్తూ దుర్మరణం చెందుతున్న వారి గురించి పోప్ కేంద్రీకరించటంతో ఐరోపా యూనియన్ అలాంటి వారిని రక్షించే బాధ్యతను తీసుకుంటూ ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాల్సి వచ్చింది. వాటికన్ అధికార వ్యవస్థలో కూడా పోప్ పెను మార్పులు ప్రవేశ పెట్టారు. వాటికన్ కురియాగా వ్యవహరించే వ్యవస్థకు అపరిమిత అధికారాలు ఉన్నాయి. అలాంటి దానిని పక్కన పెట్టి కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రతి ఖండం నుంచి ఒక కార్డినల్ ఉండే విధంగా ఎనిమిది మందితో ఒక కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. దానిలో కురియా ప్రతినిధి కూడా ఒకరుగా మాత్రమే ఉంటారు. ఆయా ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించే వారితో ప్రాంతీయ విషయాల గురించి పోప్ తెలుసుకుంటారు.కొత్త పోప్ వచ్చినపుడు మిలియన్ల యూరోలు బోనస్‌గా ఇవ్వటాన్ని పోప్ ఫ్రాన్సిస్ ఏకపక్షంగా నిలిపివేయటంతో వాటికన్ యంత్రాంగం దిమ్మెరపోయింది. అవినీతి అక్రమార్కుల పట్ల కూడా ఇదే వైఖరితో ఉన్న పోప్‌ను గిట్టని వారు కమ్యూనిస్టు అని నిందించి వెనక్కు కొట్టేందుకు చూస్తున్నారు. అయినా క్రైస్తవులు వారిని తొలి కమ్యూనిస్టులు అంటూ తిప్పి కొట్టారు.

- సత్య

కటింగ్ ఇలా కూడా...

ఈ పనిని ఇలాగే చేయాలనేముంది! ఎక్కడైనా రాసి పెట్టారా?! లేదు కదా! మరెందుకంట పాత పద్ధతినే ఫాలో అవడం. ఇదిగో చూడండి. తల పనిని ఎన్ని రకాలుగా చేసేస్తున్నారో! బొమ్మలు చూసే ఇంతగా హా...శ్చర్యపోతున్నారే! విషయం తెలిస్తే ఇంకెంత ఆశ్చర్యపోతారో మరి! ఇక్కడ తల కిందులుగా నిలబడి హెయిర్ కటింగ్ చేస్తోంది మామూలోడు కాదు. చైనా కుంగ్‌ఫూ మాష్టారు. ఏకంగా...సమురాయ్ కత్తులతో కేశాలను కత్తిరిస్తోంది వియత్నాం యువకుడు. అదేముంది!? కళ్లకు గంతలు కట్టుకుని తల పని చేసేస్తానంటున్నాడు ఉక్రెయిన్ వాసి. ఈ చైనా యువకుడికి మామూలు దువ్వెనలు, కత్తెరలు కంటికి ఆనవంట. అన్నీ భారీగానే వుండాలట. కానీ అంత పెద్ద పెద్ద దువ్వెనలను పట్టుకోవాలంటే మాటలా! చేతులు నొప్పెట్టేయవూ! నీళ్ల లోపల తల పని చేయడం చూశారా ఎప్పుడైనా! బ్రిటన్‌లో కొందరు ఈ పని చేసేసి గిన్నిస్ బుక్‌లోకి కూడా ఎక్కేశారు. టర్కీ క్షురకుడు ... ఏకంగా నిప్పుతో వెంట్రుకలు ట్రిమ్ చేసి అందర్నీ ఆశ్చర్యపరిచేశాడు. సో... తల పని ఇలా కూడా చేసేయొచ్చు. కాకపోతే... చేయించుకునే వారికి ధైర్యం కూడా వుండాలి.

✧

మీ కొరకై ..... నిరంతర అన్వేషణే జైన్ కంపెనీ లక్ష్యం

50 సంవత్సరముల నుండి సాగునీటి పారుదలలో అత్యధిక నీటి వినియోగ సామర్ధ్యము కొరకు ఉపయోగపడు పరికర ములు కనుగొనుటకు, అలుపెరుగని శ్రమతో ప్రయత్నము చేయుచున్న జైన్ కంపెనీ, ప్రపంచ రైతాంగపు ఆర్థిక వొడు దుడుకులను అధిగమించుటకు అందిస్తున్న అతి విశిష్టమైన వస్తువే జైన్ టర్బోస్లిమ్ లేటరల్ ...

ఇది తక్కువ పెట్టుబడితో అధిక పంటతో అధిక లాభాలు పొందవచ్చును. 'జైన్ టర్బోస్లిమ్'. తక్కువ మందము కలిగి నాణ్యమైన లేటరల్‌పైపు

- 'జైన్ టర్బోస్లిమ్' సాధారణముగా 16 మి.మీ (5/8 అంగుళములు) సైజులో 6,8,10,12,15 మీల్ మందములో లభ్యమగును.
- జైన్ టర్బోస్లిమ్ నేలపైన మరియు నేలలోపల అమర్చుటకు అనువయినది.

జైన్®
జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/ బి /5, పార్క్ఎదురుగా, కెనరాబ్యాంక్ దగ్గర,
గాంధీనగర్, హైద్రాబాద్- 500 080.
ఫోన్: 040-2761 4474, 2765 4681. 9440797846.
Email: jainhyderabad@jains.com, Website: www.jains.com

ఆర్ట్ అదిరె



ఆర్ట్ ఏదైనా సరే... చూడగానే అద్భుతం అనిపించాలి. చూపరుల కళ్లు మెరిసిపోవాలి. హృదయం ఉప్పొంగిపోవాలి. అలాంటి ఆర్టు కాగితం మీదే కాదు. ఎక్కడైనా సృజించొచ్చు. అందుకు మీ ఎదురుగా వున్న చిత్రరాజాలే సాక్ష్యం. తూనీగ, పక్షి, జిరాఫీ, సీ హార్స్, టీ జార్, ఎండ్రకాయ...అన్నీ మనుషుల మీద వేసినవంటే నమ్ముతారా! కాస్త పరిశీలనగా చూస్తే 'నిజమే' అన్న మాట మీ నోటెంట వచ్చేస్తుంది అప్రయత్నంగా.

బ్రిటన్ కళాకారిణి ఎమ్మా ఫే వీటిని సృజించింది. ఇంత అందమైన కళాకృతులను రూపొందించడంలో ఎమ్మా పనితనంతోపాటు, మోడళ్లు, ఫొటోగ్రాఫర్‌ల గొప్పతనం కూడా వుంది. ఎమ్మా ఒక్కో బొమ్మను వేయడానికి మూడు నాలుగు గంటల సమయం తీసుకుంటుంది. అంతసేపూ మోడళ్లు తమ శరీరాలను కదల్చకుండా వుంచాల్సిందే. అందుకు ఎంత ఓపిక, సహనం కావాలో ఆలోచించండి. ఇక చివరిగా కెమెరా కంటి గురించి. అదేనండీ ఫొటోగ్రాఫర్ గురించి. తను తీసే ఫొటోల్లో మోడల్ ఏమాత్రం కనిపించకుండా సదరు కీటకం, పక్షి, జంతువు, వస్తువు మాత్రమే అగుపించేలా ఫొటో తీయడమంటే మాటలా! ఈ ముగ్గురి పని తనం ఈ బొమ్మల్లో మిళితమైంది మరి.